నేటి కందం- నేటికి అందం



అసమాక్షుని కృపతో-ష
ప్రసముల నందించు "ఇందిరా క్యాంటిను"లై
కుసుమించెను దాతృత్వము
దెస లందున గల జనులకు తిండి నొసంగన్ !!

తెలంగాణా వ్యాప్తంగా
"ఇందిరా క్యాంటీన్లు" ఏర్పాటు

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

చురక

మాదక ద్రవ్యాల విషం
మత్తులో నేడు యువత
కాల్చివేసుకుంటున్నది
గాడితప్పి తమ భవిత
నిప్పు మీద నీళ్లలాగ
నియంత్రణ సరిపోదు
మౌలికంగా సమాజంలో
మార్పు తోనే దరికిరాదు

-వేల్పుల నారాయణ
9440433475



website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 28-6-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి :31 సంచిక:246 పేజీలు:6 వెల: రూ.1/-


## అంతర్జాతీయ ఆర్బిట్రేషన్, మీడియేషన్ సెంటర్ భూకేటాయింపు రద్దు..



హైదరాబాద్, జూన్ 27: హైదరాబాద్‌లోని అంతర్జాతీయ ఆర్బిట్రేషన్, మీడియేషన్ సెంటర్ (ఐఏఎంసీ)కు అత్యంత విలువైన ప్రాంతంలో చేసిన భూ కేటాయింపులను తెలంగాణ హైకోర్టు రద్దు చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గతంలో జారీ చేసిన జీఓలను కొట్టివేస్తూ శుక్రవారం సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేటాయింపు నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాలపై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ నిర్ణయం తీసుకుంది.

హైదరాబాద్‌లోని శేరిలింగంపల్లి మండలం రాయదుర్గం లో గల సర్వే నెంబరు 83/1లో 3.5 ఎకరాలకు పైగా భూమిని ఐఏఎంసీకి కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఐటీ కారిడార్‌లో ఉన్న ఈ భూమి విలువ సుమారు రూ. 350 కోట్లు ఉంటుందని అంచనా. అయితే, ప్రభుత్వ భూమిని ఒక ప్రైవేట్ సంస్థకు కేటాయించడం చట్టవిరుద్ధమని న్యాయవాది కె.రఘునాథ్‌రావు, వెంకటరామ్‌రెడ్డి వేర్వేరుగా హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు. జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ కె.సుజన లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్లపై విచారణ చేపట్టింది. న్యాయవాది రఘునాథ్‌రావు వాదనలు వినిపిస్తూ, సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధంగా, నిబంధనలను అతిక్రమించి ప్రభుత్వం ఈ కేటాయింపులు జరిపిందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. మరోవైపు, ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ వాదనలు వినిపించారు. హైదరాబాద్‌లో ఐఏఎంసీ ఏర్పాటు వల్ల అంతర్జాతీయ వాణిజ్య వివాదాల పరిష్కారం సులభతరం అవుతుందని తెలిపారు. న్యాయస్థానాల వెలుపల వివాదాలు పరిష్కారమవ్వాలని కోర్టులే ప్రోత్సహిస్తున్నాయని, దీనివల్ల న్యాయవ్యవస్థపై భారం కూడా తగ్గుతుందని ఆయన తెలిపారు. ఇరుపక్షాల వాదనలు ఈ ఏడాది జనవరిలోనే ముగియడంతో, ధర్మాసనం తీర్పును రిజర్వులో ఉంచింది. తాజాగా శుక్రవారం తుది తీర్పును వెలువరిస్తూ, ఐఏఎంసీకి భూమిని కేటాయించడంతో పాటు, దాని ప్రస్తుత భవన నిర్వహణ కోసం జారీ చేసిన జీఓలను సైతం పూర్తిగా కొట్టివేస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ తీర్పుతో ఐఏఎంసీ కి రాష్ట్ర ప్రభుత్వం చేసిన భూ కేటాయింపులు రద్దయ్యాయి.

## ఈ నెల 30 నుంచి జూనియర్ డాక్టర్ల ధర్నా..

హైదరాబాద్, జూన్ 27: తమ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం, వైద్యారోగ్య శాఖ మంత్రి స్పందించకపోవడంతో ఈ నెల 30 నుంచి ధర్నా చేపట్టనున్నట్టు తెలంగాణ జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ (టీ-జూడాలు) వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం టీ జూడాల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఇసాక్ న్యూటన్ ఓ ప్రకటన విడుదల చేశారు. స్టైఫండ్ చెల్లింపులో జాప్యం, మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం, బోధనా సిబ్బంది కొరత, స్కాలర్‌షిప్, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులో ఆలస్యంపై ప్రభుత్వానికి పలుమార్లు వినతి పత్రం అందజేసిన ఫలితం లేదన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 30 నుంచి చేపట్టిన ధర్నాలో రాష్ట్ర వ్యాప్తంగా జూడాలు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

## విద్యా ప్రమాణాలు.. మెరుగైన వసతులే ప్రామాణికం !

**-ఇంజినీరింగ్ కళాశాలల ఫీజుల నిర్ణయంపై ప్రభుత్వం యోచన**
**-గత విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదిక పరిశీలన**
**-పరిగణనలోకి సుప్రీంకోర్టు తీర్పులు**
**-ఆయా అంశాల అధ్యయనానికి కమిటీ నియామకం..**
**-నిర్దేశిత సమయంలోనే ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ ప్రారంభం**

హైదరాబాద్, జూన్ 27:రాష్ట్రంలో ఇంజినీరింగ్ కళాశాలల్లో ఫీజుల నిర్ణయంపై హేతుబద్ధమైన నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఆయా కళాశాలల్లో బోధన సిబ్బంది, బోధన స్థాయి, కళాశాలల్లో ల్యాబ్‌లు, భవనాలు.. ఇతర వసతులు ఇలా ప్రతి ఒక్క అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి తదనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలనే భావనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది.

కృత్రిమ మేధ (ఏఐ) వంటి కోర్సులు సాంకేతిక రంగంపై బలమైన ప్రభావం చూపుతున్న నేపథ్యంలో తెలంగాణలోని ఇంజినీరింగ్ కళాశాలలు ప్రపంచ స్థాయి ప్రమాణాలతో పోటీ పడేలా ఉండాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. మారుతున్న మార్కెట్ అవసరాలకు తగినట్లు కళాశాలలు ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతూ ప్రణాళిక బద్ధంగా ముందుకువెళ్లేలా వ్యవస్థను రూపొందించాలని ప్రభుత్వం యోచిస్తోంది.

ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇంజినీరింగ్ కళాశాలల్లో మెరుగైన వసతులు, బోధన సిబ్బంది, ల్యాబ్‌లు.. ఏఐసీటీఈ మార్గదర్శకాలకు అనుగుణంగా ఉండాలని ఆశిస్తున్నారు. ఫీజుల నిర్ణయానికి వీటినే ప్రాతిపదిక తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

ఫీజుల నిర్ణయానికి సంబంధించి ఇస్లామిక్ అకాడమీ ఆఫ్ ఎడ్యుకేషన్ వర్సెస్ కర్ణాటక, పీఏ ఇనాందార్ అండ్ అదర్స్ వర్సెస్ మహారాష్ట్ర కేసుల్లో? ఆయా కళాశాలల్లోని వసతులు, ల్యాబ్‌లు, లెక్చరర్లకు ఆ సంస్థ ఇచ్చే వేతనాలు, బోధన, బోధనేతర సిబ్బంది, కళాశాల భవిష్యత్ ప్రణాళికలు, కళాశాల ప్రమాణాల పెంపునకు తీసుకుంటున్న నిర్ణయాలను ప్రతిపాదిక చేసుకోవాలని సుప్రీంకోర్టు పేర్కొంది.

ఫీజుల నిర్ణయంలో సుప్రీంకోర్టు తీర్పులను పరిగణనలోకి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇంజినీరింగ్ కళాశాలల్లో వసతులు, బోధన సిబ్బంది.. ఇతర వ్యవహారాలపై గత ప్రభుత్వం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖతో తనిఖీలు చేయించింది. ఆ శాఖ క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేసి నివేదిక రూపొందించింది.

కానీ గత ప్రభుత్వం ఆ నివేదికపై ఎటువంటి చర్య తీసుకోలేదు. కానీ తమకు నచ్చిన కళాశాలలకు ఫీజులు పెంచుకునే అవకాశాన్ని కల్పించి.. మరికొన్ని కళాశాలలకు మాత్రం పక్షపాత వైఖరితో మొండి చేయి చూపింది.

ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఆ నివేదిక పరిశీలనతో పాటు ఇంజినీరింగ్ కళాశాలల్లో అందుతున్న విద్యా ప్రమాణాలను మదింపు చేసి ఫీజులపై నిర్ణయం తీసుకునేందుకు ఒక కమిటీని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అదే సమయంలో ఇంజినీరింగ్ కళాశాలలో ప్రవేశాలకు సంబంధించిన కౌన్సెలింగ్ ప్రక్రియను నిర్దేశిత సమయంలోనే పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

## గుజరాత్ జగన్నాథుడి రథయాత్ర సందర్భంగా వేడుకల్లో అపశృతి

**-జనసమూహాన్ని చూసి బీభత్సం సృష్టించిన ఏనుగు.. పలువురు భక్తులకు గాయలు**





గుజరాత్ జూన్ 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );జగన్నాథుడి రథయాత్ర సందర్భంగా ఇవాళ పలు ప్రధాన నగరాల్లో జగన్నాథుడి రథయాత్రకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో గుజరాత్‌లో నిర్వహించిన ఈ వేడుకల్లో అపశృతి చోటు చేసుకుంది. గుజరాత్‌లోని గోల్‌వాడ వద్ద జగన్నాథుడి రథయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా రథయాత్ర కోసం తీసుకొచ్చిన ఓ ఏనుగు జనసమూహాన్ని చూసి బీభత్సం సృష్టించింది. అదుపుతప్పి జనంపైకి దూసుకెళ్లింది. దీంతో భక్తులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఏనుగు దాడి నుంచి తప్పించుకునేందుకు ఎక్కడివారు అక్కడ పరుగులు తీశారు. ఈ క్రమంలో అక్కడ తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ ఘటనలో పలువురు భక్తులు గాయపడ్డారు. వెంటనే అప్రమత్తమైన అధికారులు ఆ ఏనుగును అదుపు చేశారు. తొక్కిసలాటలో గాయపడిన భక్తులను చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు.

## బీటెక్ సీట్ల భర్తీకి సంబంధించిన ఎప్‌సెట్ వెబ్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల

**- ఫస్ట్ ఫేజ్ జూన్ 28 నుంచి**

హైదరాబాద్ జూన్ 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : బీటెక్ సీట్ల భర్తీకి సంబంధించిన ఎప్‌సెట్ వెబ్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వీ బాలకిష్టారెడ్డి శుక్రవారం మధ్యాహ్నం విడుదల చేశారు. పాత ఫీజుల ప్రకారమే కౌన్సెలింగ్ ఉంటుందని వెల్లడించారు. మొత్తం మూడు దశల్లో బీటెక్ సీట్లను భర్తీ చేయనున్నారు. మొదటి విడుత కౌన్సెలింగ్ జూన్ 28 నుంచి ప్రారంభం కానుంది.

తొలి విడుత కౌన్సెలింగ్ షెడ్యూల్

సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం స్లాట్ బుకింగ్ - జూన్ 28 నుంచి జులై 7 వరకు

సర్టిఫికెట్ వెరిఫికేషన్ - జులై 1 నుంచి 8 వరకు

వెబ్ ఆప్షన్ల నమోదు - జులై 6 నుంచి 10 వరకు

ఫ్రీజింగ్ ఆప్షన్స్ - జులై 10

ఫస్ట్ ఫేజ్ సీట్ అలాట్‌మెంట్ - జులై 18

ట్యూషన్ ఫీజు చెల్లించేందుకు, సెల్ఫ్ రిపోర్టింగ్ - జులై 18 నుంచి 22 వరకు

సెకండ్ ఫేజ్ కౌన్సెలింగ్ షెడ్యూల్..

సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం స్లాట్ బుకింగ్(ఫస్ట్ ఫేజ్‌లో నమోదు చేసుకోని వారికి మాత్రమే) జులై 25

సర్టిఫికెట్ వెరిఫికేషన్ - జులై 26

వెబ్ ఆప్షన్ల నమోదు - జులై 26 నుంచి 27 వరకు

ఫ్రీజింగ్ ఆప్షన్స్ - జులై 27

సెకండ్ ఫేజ్ సీట్ అలాట్‌మెంట్ - జులై 30

ట్యూషన్ ఫీజు చెల్లించేందుకు, సెల్ఫ్ రిపోర్టింగ్ - జులై 30 నుంచి ఆగస్టు 1 వరకు

ఫిజికల్‌గా రిపోర్ట్ చేసేందుకు - జులై 31 నుంచి ఆగస్టు 2 వరకు

ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్ షెడ్యూల్..

సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం స్లాట్ బుకింగ్ (ఫస్ట్, సెకండ్ ఫేజ్‌లో నమోదు చేసుకోని వారు మాత్రమే) - ఆగస్టు 5

సర్టిఫికెట్ వెరిఫికేషన్ - ఆగస్టు 6

వెబ్ ఆప్షన్ల నమోదు - ఆగస్టు6 నుంచి 7 వరకు

ఫ్రీజింగ్ ఆప్షన్స్ - ఆగస్టు 7

సీట్ అలాట్‌మెంట్ - ఆగస్టు 10

ట్యూషన్ ఫీజు చెల్లించేందుకు, సెల్ఫ్ రిపోర్టింగ్ - ఆగస్టు 10 నుంచి 12 వరకు

ఫిజికల్‌గా రిపోర్ట్ చేసేందుకు - ఆగస్టు 11 నుంచి 13 వరకు

## లెబనాన్‌లోని హెజ్బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ దాడులు



న్యూఢిల్లీ, జూన్ 27: లెబనాన్‌లోని హెజ్బొల్లా భూగర్భ స్థావరాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ బంకర్ బస్టర్ బాంబులతో విరుచుకుపడింది. శుక్రవారం ఇజ్రాయెల్ వైమానిక దళం లెబనాన్‌లోని పలు పర్వత ప్రాంతాల్లోగల ఉగ్రవాద హెజ్బొల్లా గ్రూప్ భూగర్భ స్థావరాలే లక్ష్యంగా దాడులు చేసింది. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ అధికారులు వెల్లడించారు.

ఈ దాడుల్లో పలువురు హెజ్బొల్లా నేతలకు సంబంధించిన ముఖ్యమైన ఆయుధ స్థావరాలను సైతం ధ్వంసం చేసినట్లు తెలిపారు. టెల్ అవీవ్ ప్రయోగించిన బంకర్ బస్టర్ బాంబులవల్ల పలు ప్రాంతాల్లోని భవనాలు దెబ్బతినగా.. అనేకమంది పాలస్తీనియన్‌లు గాయాలపాలైనట్లు లెబనాన్ వార్తా సంస్థ వెల్లడించింది. శిథిలాల కింద పలువురు చిక్కుకుపోవడంతో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, ప్రాణనష్టానికి సంబంధించిన తక్షణ సమాచారం లేదని అధికారులు పేర్కొన్నారు.

గత ఏడాది నవంబర్‌లో అమెరికా మధ్యవర్తిత్వంతో ఇజ్రాయెల్, హెజ్‌బొల్లా మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగింది. హమాస్‌కు మద్దతుగా ఇజ్రాయెల్‌పై హెజ్బొల్లా దాడులు చేయడంతో.. ప్రతి చర్యగా ఇజ్రాయెల్ ఆర్మీ విరుచుకుపడింది. ఆ సంస్థకు చెందిన పలు స్థావరాలను ధ్వంసం చేసింది. ఈ నేపథ్యంలోనే అమెరికా మధ్యవర్తిత్వంతో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది.

## 29 న తెలంగాణలో పర్యటించనున్న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా

హైదరాబాద్ జూన్ 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలంగాణలో పర్యటించనున్నారు. జూన్ 29(ఆదివారం) తెలంగాణకు అమిత్ షా రానున్నారు. ఎల్లుండి ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయానికి ఆయన చేరుకోనున్నారు. అక్కడి నుంచి నిజామాబాద్‌కు బయల్దేరతారు. అక్కడ జరిగే వివిధ కార్యక్రమాల్లో అమిత్ షా పాల్గొననున్నారు. నిజామాబాద్ లో జాతీయ పసుపు బోర్డు కార్యాలయాన్ని ప్రారంభిం చనున్నారు. అలాగే, బిజెపి ఎంపి ధర్మపురి అరవింద్ తండ్రి, దివంగత కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డి శ్రీనివాస్ విగ్రహాన్ని అమిత్ షా ఆవిష్కరించనున్నారు.

## ఛార్జింగ్ అవుతుండగా పేలిన స్కూటీ బ్యాటరీ.. వృద్ధురాలు మృతి

అమరావతి, జూన్ 27:ఇంట్లో చార్జింగ్ అవుతుండగా ఎలక్ట్రిక్ స్కూటీ బ్యాటరీ ఒక్కసారిగా పేలిపోయింది. ఈ పేలుడు ఘటనలో ఓ 62 ఏళ్ల మహిళ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడప జిల్లా ఎర్రగుంట్ల మండలంలోని పొట్లదుర్తి గ్రామంలో శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది.

మరణించిన వృద్ధురాలి పేరు వెంకటలక్ష్మమ్మగా పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. ఇంట్లో బ్యాటరీ చార్జింగ్ పెట్టిన సమయంలో వెంకట లక్ష్మమ్మ ఆ పక్కనే ఉన్న సోఫాలో నిద్రపోతున్నారు. బ్యాటరీ పేలగానే ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల్లో ఆ మంటలు సోఫాకు, ఇంట్లోని ఇతర వస్తువులకు అంటుకున్నాయి. తీవ్రంగా కాలిన గాయాలతో వెంకటలక్ష్మమ్మ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. వెంకట లక్ష్మమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా ఎలక్ట్రిక్ స్కూటీ బ్యాటరీలు పేలడం ఇదే తొలిసారి కాదు. గతంలో కూడా తెలుగు రాష్ట్రాల్లో పలు సందర్భాల్లో ఎలక్ట్రిక్ స్కూటీల బ్యాటరీలు పేలాయి.

## బొల్లారంలో నూతనంగా నిర్మించిన పాఠశాల, కళాశాల భవనాలు ప్రారంభం



హైదరాబాద్, జూన్ 27:కంటోన్మెంట్, బొల్లారంలోని ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాల నూతన భవనాలను గ్లాండ్ ఫార్మా సంస్థ సహకారంతో సిఎస్ఆర్ నిధులతో నిర్మించిన ప్రభుత్వ పాఠశాల, కళాశాల భవనాలను శుక్రవారం గ్లాండ్ ఫార్మా మేనేజింగ్ ట్రస్టీ రఘు రామన్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ లక్ష్మి, ఎమ్మెల్యే శ్రీ గణేష్ కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. సిఎస్ఆర్ నిధుల కింద ల్యాండ్ ఫార్మా సంస్థ చేసిన సహకారం గొప్పదని కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు రాజకీయాలలో, వివిధ రంగాలలో ఉన్నత స్థాయిలో ఉన్నారని తెలిపారు. మట్టిలో మాణిక్యాల లాంటి విద్యార్థులు ప్రభుత్వ పాఠశాల కళాశాలలోనే తయారవుతారని, కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన జరుగుతున్నట్లు, విద్యార్థులు కూడా ప్రయోజకులు అవుతున్నారని వెల్లడించారు.

అనంతరం సంస్థ ట్రస్టీ రఘు రామన్ మాట్లాడుతూ.. నూతన పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు అన్ని రకాల వసతులు, అధునాతన సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు వారికి వచ్చే అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం పదవ తరగతి, ఇంటర్ ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం చేసి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ లక్ష్మి, డీఈఓ కిషన్, ఇంటర్మీడియట్ బోర్డు ఎడ్యుకేషన్ డిప్యూటీ సెక్రెటరీ యాదగిరి, ఉపాధ్యాయులు ఫెడ్రిక్, సంస్థ ప్రతినిధులు, సీనియర్ నాయకులు వేణుగోపాల్ రెడ్డి, జయ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదల

హైదరాబాద్ జూన్ 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తెలంగాణకు సంబంధించిన పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఏడాది 38,741 మంది విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాయగా.. అందులో 24,415 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలంగాణ ఇంటర్ బోర్డు తెలిపింది. ఈ పరీక్షలను జూన్ 2 నుంచి 13 వ తేదీ వరకూ నిర్వహించారు. తెలంగాణలో ఈ ఏడాది మొత్తం 92.78 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల కోసం.. ఎబవ.బివశ్రీజీనిణజీనిజీ.ణనీల.తిని అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించి, డౌన్‌లోడ్ చేసుకోవచ్చు

## కోల్‌కతాలో మరో దారుణ ఘటన.. న్యాయ విద్యార్థినిపై సామూహిక అత్యాచారం

న్యూఢిల్లీ, జూన్ 27:పశ్చిమ బెంగాల్ రాష్ట్రం కోల్‌కతా లో మరో దారుణ ఘటన చోటు చేసుకుంది. కస్బా పరిసరాల్లో ఓ న్యాయ విద్యార్థినిపై సామూహిక అత్యాచారం జరిగింది. బుధవారం రాత్రి 7:30 నుంచి 8:50 గంటల మధ్య కాలేజ్ క్యాంపస్ లో ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. ఈ కేసులో ఇప్పటి వరకూ ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. అరెస్టైన వారిలో ఇద్దరు విద్యార్థులు కాగా, మరో వ్యక్తి కళాశాల సిబ్బందిగా పేర్కొన్నారు. ఈ ఘటనపై కోల్‌కతా మేయర్ ఫిర్హాద్ హకీమ్ విలేకరులతో మాట్లాడుతూ.. ఇది చాలా తీవ్రమైన సంఘటన అని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన ఇంకా పూర్తి సమాచారం తనకు అందలేదని తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మరోవైపు ఈ ఘటనపై బీజేపీ తీవ్ర స్థాయిలో స్పందించింది. ఈ మేరకు రాష్ట్రంలోని మమతా బెనర్జీ నేతృతంలోని తృణమూల్ ప్రభుత్వంపై విమర్శలు చేసింది. రాష్ట్రంలో మహిళలు, విద్యార్థినులకు భద్రత కరవైందని ధ్వజమెత్తింది.

కాగా, 2024 ఆగస్టు 9న కోల్‌కతాలోని ఆర్‌జీకార్ ఆసుపత్రిలో సెమినార్ రూమ్‌లో ఒంటరిగా నిద్రిస్తున్న జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటనపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం కాగా ఆర్‌జీకార్ దవాఖాన డాక్టర్లు, వైద్య విద్యార్థులు సుదీర్ఘకాలం ఆందోళనలు నిర్వహించారు. ఘటన అనంతరం ఆసుపత్రి ఆవరణలోని సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా సంజయ్‌ను ఆగస్టు 10న కోల్‌కతా పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం ఈ కేసును సీబీఐ విచారించింది. ప్రధాన నిందితుడిగా సంజయ్ రాయ్ పేరును ఛార్జ్‌షీట్‌లో చేర్చి కోర్టుకు సమర్పించింది. దీనిపై విచారణ జరిపిన కోల్‌కతాలోని సీల్దా కోర్టు.. సంజయ్ రాయ్‌ని దోషిగా నిర్ధారించింది. ఈ మేరకు దోషికి జీవితఖైదు విధించింది. ఈ ఘటన మరవకముందే ఇప్పుడు మరో విద్యార్థినిపై అత్యాచారం ఘటన వెలుగు చూడటం ఆందోళన కలిగిస్తోంది.




# నవంబరులో ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్-2025

న్యూఢిల్లీ, జూన్ 27:జైపూర్ వేదికగా నవంబరులో పూర్ణిమ విశ్వవిద్యాలయం, రాజస్థాన్ విశ్వవిద్యాలయాలు సంయుక్తంగా ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్-2025ను నిర్వహించనున్నట్లు బుధవారం ప్రకటించారు. 2020 ఫిబ్రవరిలో ప్రారంభమైన ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో ఇవి అయిదో గేమ్స్.

ఈ బహుళ-క్రీడా పోటీల్లో 200కు పైగా విశ్వవిద్యాలయాల నుంచి 4,000ల కంటే ఎక్కువ మంది అథ్లెట్లు పాల్గొంటారని అంచనా వేస్తున్నారు. మునుపటి ఎడిషన్ల మాదిరిగానే, కేఐయూజీ-2025లోనూ కనీసం 20 క్రీడాంశాలు ఉండనున్నాయి. అస్సాం, అరుణాచల్ ప్రదేశ్, మేఘాలయ, మిజోరం, సిక్కిం, నాగాలాండ్, త్రిపుర రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహించిన కేఐయూజీ-2024 పోటీల్లో చండీగఢ్ విశ్వవిద్యాలయం టీమ్ ఛాంపియన్‌షిప్‌లను గెలుచుకుంది.

"ఖేలో ఇండియా యూత్ గేమ్స్ రాజస్థాన్ వేదికగా 2025 నవంబరులో నిర్వహించనున్నట్లు ప్రకటించడం నాకు సంతోషంగా ఉంది. ఈ సంవత్సరం మే నెలలో బీహార్ వేదికగా నిర్వహించిన అండర్-18 ఖేలో ఇండియా యూత్ గేమ్స్ తర్వాత ఈ క్రీడలను అండర్-25 అథ్లెట్ల కోసం నిర్వహించనున్నాం. దేశంలోని అత్యుత్తమ ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించడంలో భాగంగా, జాతీయస్థాయి వేదికను కోరుకునే అథ్లెట్లకు ఈ క్రీడలు గొప్ప అవకాశాన్ని అందిస్తాయి" అని కేంద్ర క్రీడలు, యువజన వ్యవహారాల మంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ పేర్కొన్నారు.

కేఐయూజీ-2024 అథ్లెటిక్స్ విభాగంలో ఎనిమిది ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్ స్థాయి రికార్డులు నమోదయ్యాయి. వాటిలో అయిదు రికార్డులు పురుషులే నమోదు చేశారు. "ప్రపంచవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల విద్యార్థులు బహుళ-క్రీడా కార్యక్రమాల్లో ఆధిపత్యం కనబరుస్తున్నారు. రాజస్థాన్ వేదికగా అథ్లెట్లు అత్యుత్తమ ఆటతీరు కనబరిచే నాణ్యమైన ప్రదర్శనలను చూడాలని వేం ఆశిస్తున్నాం" అని డాక్టర్ మాండవీయ వ్యాఖ్యానించారు.

ఈశాన్య భారత్‌లో నిర్వహించిన కేఐయూజీ-2024 పోటీల్లో 240 స్వర్ణ, 240 రజత, 290 కాంస్య పతకాలు సహా మొత్తం 770 పతకాలను విజేతలకు ప్రదానం చేశారు. కేఐయూజీ-2024 టైటిల్ కోసం 20 క్రీడాంశాల్లో 200లకు పైగా విశ్వవిద్యాలయాల నుంచి 4500లకు పైగా విద్యార్థులు పోటీపడ్డారు.

ఈత విభాగంలో ఉత్కళ్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రత్యాసరే నాలుగు స్వర్ణాలు, ఒక రజతం, ఒక కాంస్యం గెలుపొంది అత్యంత విజయవంతమైన మహిళా అథ్లెట్‌గా నిలిచారు. జైన్ విశ్వవిద్యాలయానికి చెందిన జేవియర్ మైఖేల్ డిసౌజా నాలుగు స్వర్ణ పతకాలు గెలుచుకుని అత్యంత విజయవంతమైన పురుష అథ్లెట్‌గా నిలిచారు.

కేఐయూజీ-2024లో 20 స్వర్ణాలు, 14 రజతాలు, ఎనిమిది కాంస్యాలతో మొత్తం 42 పతకాలు సాధించిన లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ రెండో స్థానంలో.. అమృత్‌సర్‌లోని గురు నానక్ దేవ్ యూనివర్సిటీ 12 స్వర్ణాలు, 20 రజతాలు, 19 కాంస్యాలతో మొత్తం 51 పతకాలు సాధించి మూడో స్థానంలో నిలిచాయి.

# పూణే మెట్రో రైలు ప్రాజెక్టు రెండో దశకు కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ, జూన్ 27:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రివర్గం పూణే మెట్రో రైలు ప్రాజెక్టు రెండో దశకు ఆమోదం తెలిపింది. మొదటి దశలోని వనాజ్-రాంవాడీ కారిడాంకు పొడిగింపుగా.. వనాజ్ నుంచి చాందనీ చౌక్ వరకు (కారిడార్ 2ఏ), రాంవాడీ నుంచి వాఘోలీ/విఠల్ వాడీ వరకు (కారిడార్ 2బీ) రెండో దశలో పనులు చేపడతారు. విస్తరించనున్న ఈ రెండు కారిడార్ల పొడవు 12.75 కి.మీ. వీటిలో 13 స్టేషన్లు వేగంగా అభివృద్ధి చెందుతున్న శివారు ప్రాంతాలైన చాందనీ చౌక్, బావ్‌ధాన్, కొత్రూడ్, ఖరాడీ, వాఘోలీలను అనుసంధానించేలా రూపొందించారు. ఈ ప్రాజెక్టును నాలుగేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.3626.24 కోట్లు. కేంద్రం, మహారాష్ట్ర ప్రభుత్వం, ఇతర ద్వైపాక్షిక/బహుపాక్షిక సంస్థలు ఈ వ్యయాన్ని సమానంగా భరిస్తాయి. ఈ వ్యూహాత్మక ప్రతిపాదనను ప్రస్తుత కారిడార్?2కు విస్తరణగా చెప్పవచ్చు. సమగ్ర ప్రయాణ ప్రణాళిక (సీఎంపీ)కు అనుగుణంగా దీనిని రూపొందించారు. పూణేలో తూర్పు- పశ్చిమ ప్రాంతాల్లో ప్రజలకు ప్రయాణ సదుపాయాన్ని మెరుగుపరిచేలా చాందనీ చౌక్ నుంచి వాఘోలీ వరకు ఒకే మెట్రో కారిడార్ ఏర్పాటు ఈ ప్రణాళికలో భాగం.

ఈ విస్తరణలు కీలకమైన ఐటీ కూడళ్లు, వాణిజ్య ప్రాంతాలు, విద్యా సంస్థలు, నివాస ప్రాంతాల ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తాయి. ఇది ప్రజా రవాణా వ్యవస్థ వాటాను, అందులో ప్రయాణికుల సంఖ్యను పెంచుతుంది. కొత్త కారిడార్లు జిల్లా కోర్టు ఇంటర్‌చేంజ్ స్టేషన్ వద్ద లైన్ -1 (నిగ్డీ-కాత్రాజ్), లైన్ -3 (హింజేవాడి-జిల్లా కోర్టు)తో అనుసంధానమవుతూ.. పట్టణ ప్రాంతాల్లో అంతరాయం లేకుండా వివిధ రకాల ప్రయాణానికి అవకాశం కల్పిస్తాయి.

దీర్ఘకాలిక రవాణా ప్రణాళిక కింద- ముంబయి, బెంగళూరు వంటి నగరాల నుంచి ఇంటర్‌సిటీ బస్సులు చాందనీ చౌక్ వద్దకు.. మరోవైపు అహల్యా నగర్, ఛత్రపతి శంభాజీ నగర్ నుంచి వచ్చే బస్సులు వాఘోలీ వద్దకు చేరుతాయి. ఇది పూణే మెట్రో సేవలను ప్రయాణికులను మరింత అందుబాటులోకి తెస్తుంది. జనసమర్ధం ఎక్కువగా ఉండే పౌడ్ రోడ్డు, నగర్ రోడ్లలో రద్దీని తగ్గించడానికి కూడా ఈ కారిడార్ల పొడిగింపు దోహదపడుతుంది. సురక్షితమైన, వేగవంతమైన, పర్యావరణ అనుకూల ప్రయాణ అవకాశాలను అందిస్తుంది.

ఈ కారిడార్లు పూర్తయితే మొత్తం లైన్-2లో రోజువారీ ప్రయాణికుల సంఖ్య 2027లో 0.96 లక్షలు, 2037లో 2.01 లక్షలు, 2047లో 2.87 లక్షలు, 2057లో 3.49 లక్షలకు పెరుగుతుందని అంచనా. ఈ ప్రాజెక్టును మహారాష్ట్ర మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (మహా-మెట్రో) అమలు చేస్తుంది. అన్ని సివిల్, ఎలక్ట్రో-మెకానికల్, సంబంధిత పనులను ఇది నిర్వహిస్తుంది. స్థలం కోసం సర్వే, విస్పష్టమైన డిజైన్ సంప్రదింపుల వంటి నిర్మాణ పూర్వ కార్యకలాపాలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ఈ వ్యూహాత్మక విస్తరణ పూణే ఆర్థిక సామర్థ్యాన్ని చాటడంతోపాటు పట్టణ రవాణా మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తుంది. అంతేకాకుండా నగరంలో సుస్థిర, సమ్మిళిత అభివృద్ధికి విశేషంగా దోహదం చేస్తుంది.

# పాకిస్తాన్‌లో తయారైన వస్తువులను రవాణా చేస్తున్న 39 కంటైనర్లను సీజ్ చేసిన డీఆర్ఐ

న్యూఢిల్లీ, జూన్ 27:అక్రమ దిగుమతులను అరికట్టే లక్ష్యంతో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) "ఆపరేషన్ డీప్ మానిఫెస్ట్" పేరుతో విస్తృత తనిఖీలు చేపట్టింది. ప్రధానంగా దుబాయ్, యూఏఈ సహా పలు దేశాల మీదుగా తరలించిన పాకిస్తాన్ వస్తువుల అక్రమ దిగుమతులు లక్ష్యంగా ఈ తనిఖీలు నిర్వహించారు. ఈ ఆపరేషన్ ద్వారా ఇప్పటివరకు సుమారు రూ. 9 కోట్ల విలువైన 1,115 మెట్రిక్ టన్నుల వస్తువులను తరలిస్తున్న 39 కంటైనర్లను సీజ్ చేశారు. దిగుమతి విధాన నిబంధనలను, పాకిస్తాన్‌లో తయారైన వస్తువుల ప్రత్యక్ష..పరోక్ష దిగుమతి, రవాణాలపై ప్రభుత్వం విధించిన నిషేధాన్ని ఈ దిగుమతులు ఉల్లంఘిస్తున్నాయి. దీంతో ఈ వస్తువులను దిగుమతి చేసుకుంటున్న సంస్థ భాగస్వాముల్లో ఒకరిని ఈరోజు అరెస్టు చేశారు.

పహల్గామ్ ఉగ్రవాద దాడుల అనంతరం ప్రభుత్వం.. పాకిస్తాన్‌లో తయారయ్యే , ఆ దేశం ఎగుమతి చేసే వస్తువుల ప్రత్యక్ష, పరోక్ష దిగుమతి, రవాణాలపై సమగ్ర నిషేధం విధించింది. ఈ నిషేధం మే 2 నుంచి అమలులోకి వచ్చింది. గతంలో, అటువంటి వస్తువుల దిగుమతిపై 200 శాతం కస్టమ్స్ సుంకం వసూలు చేసేవారు. అయితే ప్రస్తుతం ఈ వస్తువుల దిగుమతిపై నిషేధం అమలులో ఉన్నప్పటికీ కొందరు దిగుమతిదారులు ఈ వస్తువులు తయారైన దేశాన్ని తప్పుగా చూపిస్తూ.. సంబంధిత షిప్పింగ్ పత్రాలను తారుమారు చేస్తూ వాటిని అక్రమంగా దిగుమతి చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

రెండు వేర్వేరు ఘటనల్లో నవాషెవా ఓడరేవు వద్ద ఈ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ వస్తువులు యూఏఈలో తయారైనట్లు రవాణాదారులు తప్పుడు పత్రాలు చూపారు. అయితే ఇవి నిజానికి పాకిస్తాన్‌లో తయారైనవనీ, భారత్‌లో దిగుమతి కోసం వీటిని దుబాయ్ మీదుగా తరలిస్తున్నారని దర్యాప్తులో తేలింది.

మొదట ఈ వస్తువులను పాకిస్తాన్ నుంచి దుబాయ్‌కి ఒక ఓడలో ఉంచిన కంటైనర్ల ద్వారా తరలించి.. ఆ తర్వాత వేరొక ఓడలోని కంటైనర్లకు బదిలీ చేసి భారత్‌కు తరలిస్తున్నట్లు దర్యాప్తులో గుర్తించారు. ఇప్పటివరకు నిర్వహించిన దర్యాప్తులో పట్టుబడిన వస్తువులను మరింత లోతుగా పరిశీలించి, పత్రాలను విశ్లేషించి.. పాకిస్తాన్‌లోని కరాచీ ఓడరేవు నుంచి ఈ వస్తువులు దుబాయ్‌లోని జాబెల్ అలీ ఓడరేవు మీదుగా భారత ఓడరేవులకు తరలిస్తున్నట్లు కనుగొన్నారు. అంతేగాకుండా పాకిస్తాన్ సంస్థలతో జరిపిన నగదు లావాదేవీలు, ఆర్థిక సంబంధాల వివరాలనూ గుర్తించారు. ఇది అక్రమ ఆర్థిక లావాదేవీల వ్యవహారాన్నీ వెలుగులోకి తెచ్చింది. పాకిస్తాన్, యూఏఈలకు చెందిన పలువురు మోసపూరిత ప్రణాళికలతో పాకిస్తాన్ లో తయారైన ఈ వస్తువులను వేరే చోట తయారైనవిగా చూపి అక్రమంగా భారత్‌కు తరలించేందుకు ప్రయత్నిస్తున్నారు.

"ఆపరేషన్ సిందూర్" నేపథ్యంలో పెరిగిన భద్రతా చర్యల్లో భాగంగా పాకిస్తాన్ నుంచి వచ్చే సరుకులే లక్ష్యంగా డీఆర్ఐ తనిఖీలు చేపట్టింది. ఇంటెలిజెన్స్ సమాచారం, డేటా విశ్లేషణల ద్వారా నిఘాను మరింత పటిష్టం చేసింది. ఈ చర్యల ఫలితంగా అధిక మొత్తంలో వస్తువులను సీజ్ చేసింది.

ప్రాంతీయ, ప్రపంచ భద్రతకు ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ప్రభుత్వ విధానాలు, కస్టమ్స్..ఇతర సంబంధిత చట్టాల పరిరక్షణ పట్ల డీఆర్ఐ దృఢమైన నిబద్ధతకు "ఆపరేషన్ డీప్ మానిఫెస్ట్" నిదర్శనంగా నిలుస్తుంది. జాతీయ-ఆర్థిక భద్రతను కాపాడటం, పాకిస్తాన్‌లో తయారైన వస్తువులను అక్రమంగా దిగుమతి చేసుకోవడం కోసం వాణిజ్య మార్గాల దుర్వినియోగాన్ని నిరోధించడం ఈ ఆపరేషన్ లక్ష్యం. వ్యూహాత్మక నిఘా, లక్ష్యాల అమలు, వివిధ సంస్థలతో సమన్వయం ద్వారా భారత ఆర్థిక సరిహద్దుల భద్రత విషయంలో డీఆర్ఐ కీలక పాత్ర పోషిస్తోంది.

# స్పేస్ పాలసీపై సీఎం చంద్రబాబు సమీక్ష !

అమరావతి, జూన్ 27:ఆంధ్రప్రదేశ్ స్పేస్ పాలసీ 4.0పై ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఆంధ్రప్రదేశ్ స్పేస్ టెక్నాలజీ సలహాదారు, ఇస్రో మాజీ చైర్మన్ సోమనాథ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సోమనాథ్ మాట్లాడుతూ, స్పేస్ విజన్ పాలసీ 2047 కింద కేంద్ర ప్రభుత్వం పలు కీలక ప్రాజెక్టులను ప్రారంభించిందని చెప్పారు. భవిష్యత్ అనేది అంతరిక్ష రంగానిదేనని, ఈ రంగంలో ముందుగానే వ్యూహాత్మక ప్రణాళికలు రూపొందించుకుని అమలు చేయాల్సిన అవసరం ఉందని ఆయన ముఖ్యమంత్రికి వివరించారు. అంతరిక్ష రంగంలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషించేందుకు అన్ని అవకాశాలున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు.

రాష్ట్రాన్ని అంతరిక్ష రంగంలో అగ్రస్థానానికి తీసుకెళ్లే వ్యూహం

ఈ పాలసీ ద్వారా రాష్ట్రంలో రూ.25 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీంతో ప్రత్యక్షంగా 5,000 మందికి, పరోక్షంగా 30,000 మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయని ముఖ్యమంత్రి అన్నారు.

లేపాక్షి, తిరుపతిలో స్పేస్ సిటీల ఏర్పాటు కోసం ఆమోదం తెలిపిన సీఎం, విద్యాసంస్థలను పాలసీలో భాగస్వాములుగా చేస్తూ, యువతలో స్పేస్ రంగం పట్ల ఆసక్తిని పెంచాలన్నారు. టెక్నాలజీని అందుబాటులో ఉంచేందుకు కామన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కల్పించి, ప్లగ్ అండ్ ప్లే విధానాన్ని అమలు చేయాలని సూచించారు.

# రేషన్ బియ్యం పంపిణీపై సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ అధికారుల ఆరా



వరంగల్, జూన్ 27:జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలో పలు రేషన్ డిపోలను సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. రేషన్ డిపోలు వివరాలను తెలుసుకుని, సరుకులను పరిశీలిస్తున్నారు. ఈ తనిఖీలు సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ డిప్యూటీ డైరెక్టర్ జై.ప్రకాష్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, అధికారులు తనిఖీలు చేపట్టారు.

ఈ సందర్భంగా సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ డిప్యూటీ డైరెక్టర్ జై ప్రకాష్, కమిటీ సభ్యులు మాట్లాడుతూ? గణపురం షాప్ నెంబర్ మూడు రేషన్ డిపో తనిఖీ చేశామన్నారు. ప్రజలకు రేషన్ పంపిణీ చేస్తున్న విధానం, రేషన్ బియ్యం వివరాలను నేరుగా ప్రజల నుంచి అడిగి తెలుసుకున్నామని చెప్పారు. ప్రజలకు సక్రమంగా రేషన్ బియ్యం అందించకపోతే రేషన్ షాపులపై, సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట భూపాలపల్లి జిల్లా సివిల్ సప్లై అధికారి శ్రీనాథ్, పలు మండలాల తహసిల్దార్లు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలో జూరాల ప్రాజెక్ట్‌కు గ్రహణం : కెటీఆర్

హైదరాబాద్, జూన్ 27:సాగు, తాగునీటి ప్రాజెక్టుల నిర్వహణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, ఈ చేతకానితనం వల్లే నిన్న జూరాలకు, నేడు మంజీరాకు ప్రమాద ఘంటికలు మోగుతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటీఆర్ ఆరోపించారు. గత మార్చి 22న స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ (ఎస్డీఎస్ఓ) నిపుణుల బృందం మంజీరా బ్యారేజీని పరిశీలించి, దాని భద్రతపై ప్రభుత్వానికి ఒక నివేదిక సమర్పించిందని కేటీఆర్ గుర్తుచేశారు.

ఈ మేరకు ఆయన తన ఎక్స్ ఖాతాలో ట్విట్ చేశారు. ఆ నివేదికను ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేయడం క్షమించరాని నేరమని మండిపడ్డారు. ఊహించని వరద ప్రవాహం కారణంగా మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లకు పగుళ్లు వచ్చిన తరహాలోనే, మంజీరా బ్యారేజీపై కూడా వరద ఒత్తిడి పెరిగి పిల్లర్లకు పగుళ్లు వచ్చాయని, అప్రాన్ కొట్టుకుపోయిందని, స్పిల్‌వే దెబ్బతిన్నదని ఎస్డీఎస్ఓ నివేదిక స్పష్టంగా హెచ్చరించినా ముఖ్యమంత్రి మొద్దు నిద్ర వీడకపోవడం దారుణమని విమర్శించారు.

ఎన్డీఎస్ఏ నివేదిక ఇచ్చినా మేడిగడ్డ మరమ్మతులు చేపట్టకపోవడం, ఇప్పుడు ఎస్డీఎస్ఓ హెచ్చరించినా మంజీరాను పట్టించుకోకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ అలసత్వానికి, దుర్మార్గపు వైఖరికి నిదర్శనమని కేటీఆర్ నిప్పులు చెరిగారు.

"మేడిగడ్డ బ్యారేజీలోని రెండు పిల్లర్ల పగుళ్లపై నానా యాగీ చేసిన కాంగ్రెస్, బీజేపీ నేతలు.. ఇప్పుడు మంజీరా పిల్లర్లకు వచ్చిన పగుళ్లపై కనీసం స్పందించకపోవడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం" అని ఆయన అన్నారు. గత ప్రభుత్వాలు నిర్మించిన ప్రాజెక్టులపై కక్ష గట్టి, చిన్నపాటి మరమ్మతులు కూడా చేయకుండా నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు.

రానున్న రోజుల్లో ఎగువ నుంచి మంజీరాలోకి వరద ఉద్ధృతి పెరిగితే బ్యారేజీ మరింత ప్రమాదంలో పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారని కేటీఆర్ తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఇప్పటికైనా చిల్లర రాజకీయాలు పక్కనపెట్టి మేడిగడ్డ, మంజీరా బ్యారేజీలకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కేవలం రాజకీయ కక్ష సాధింపులతో కాలం గడుపుతూ తాగు, సాగునీటి ప్రాజెక్టులను నిర్వీర్యం చేస్తే సీఎం రేవంత్ రెడ్డిని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చరిత్ర క్షమించదని కేటీఆర్ హెచ్చరించారు. చివరగా ఆయన 'జై తెలంగాణ' అని తన ప్రకటనను ముగించారు.


కొప్పర్తి పుస్తకాల ఆవిష్కరణ

జూన్ 29, 2025 ఆదివారం సాయంత్రం 6 గంటలకు

సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియం

బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్, హైదరాబాద్

అధ్యక్షత

శ్రీ వాడ్రేవు చినవీరభద్రుడు

ప్రముఖ కవి, విమర్శకులు, చిత్రకారులు



చరిత్ర, సామాజిక వ్యాసాల సంపుటి

సంభాషణ

ఆవిష్కరణ ఆచార్య వకుళాభరణం రామకృష్ణ

ప్రముఖ చరిత్రకారులు

విశ్లేషణ శ్రీ దూసనపూడి సోమసుందర్

జాతీయ కార్యదర్శి, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్



మూడు కవిత్వ సంపుటాల సంకలనం

కొప్పర్తి కవిత్వం

ఆవిష్కరణ డా. పాపినేని శివశంకర్

కేంద్ర సాహిత్య అకాడెమి పురస్కారగ్రహీత

విశ్లేషణ శ్రీ దర్భశయనం శ్రీనివాసాచార్య

ప్రముఖ కవి, విమర్శకులు

యువకవుల స్పందన కట్టా సిద్ధార్థ

కడలి

అందరికీ ఆహ్వానం

సాహితీమిత్రులు, హైదరాబాద్


# 'రాజ్యాంగ హత్యా దివస్' సందర్భంగా ఢిల్లీలో 'ది ఎమర్జెన్సీ డైరీస్ - ఇయర్స్ దట్ ఫోర్జ్‌డ్ ఏ లీడర్' పుస్తకాన్ని విడుదల చేసిన కేంద్ర హోం, సహకార మంత్రి శ్రీ అమిత్ షా

న్యూఢిల్లీ, జూన్ 27:'రాజ్యాంగ హత్యా దివస్' సందర్భంగా ఢిల్లీలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో 'ది ఎమర్జెన్సీ డైరీస్ – ఇయర్స్ దట్ ఫోర్జ్‌డ్ ఏ లీడర్' అనే పుస్తకాన్ని కేంద్ర హోం, సహకార మంత్రి శ్రీ అమిత్ షా విడుదల చేశారు. అత్యవసర పరిస్థితి వ్యతిరేక ఉద్యమంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అనుభవాల సంకలనం చేస్తూ ఈ పుస్తకాన్ని తీసుకొచ్చారు. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ, రైల్వే, సమాచార, ప్రసార మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్.. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ శ్రీ వినయ్ కుమార్ సక్సేనా.. ఢిల్లీ ముఖ్యమంత్రి శ్రీమతి రేఖ గుప్తా, ఇతర ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కేంద్ర హోంమంత్రి శ్రీ అమిత్ షా మాట్లాడుతూ జయప్రకాష్ నారాయణ్, నానాజీ దేశ్‌ముఖ్ నేతృత్వంలో జరిగిన 19 నెలల అత్యవసర పరిస్థితి వ్యతిరేక ఉద్యమంలో అజ్ఞాతవాసంలో ఉంటూ మోదీ పోరాటాన్ని కొనసాగించిన తీరుతో పాటు సంఘ్ ప్రచారక్‌గా ఆ సమయంలో ఆయన చేసిన కృషిని ఈ పుస్తకం వివరిస్తోందన్నారు. మీసా చట్టం కింద జైలుకు వెళ్లిన వారి ఇళ్లకు ఎలా వెళ్లారు!.. వారి కుటుంబాలతో మాట్లాడి వారి చికిత్స కోసం ఏ విధంగా ఏర్పాట్లు చేశారు? అన్నదానిని ఈ పుస్తకం తెలియజేస్తోంది. రహస్యంగా ప్రచురితమైన వార్తా పత్రికలను మార్కెట్లలో విద్యార్థులు, మహిళలకు పంపిణీ చేస్తూ 25 ఏళ్ల గుజరాతీ యువకుడైన మోదీ పోరాటం కొనసాగించారు. దీనిని కూడా పుస్తకం వివరిస్తోంది. ఆ సమయంలో మోదీ అజ్ఞాతవాసంలోనే పనిచేశారని.. కొన్ని సార్లు సాధువుగా, కొన్ని సార్లు సర్దార్జీగా, కొన్నిసార్లు హిప్పీగా, కొన్నిసార్లు అగరుబత్తీల విక్రేతగా, కొన్నిసార్లు వార్తాపత్రిక విక్రేతగా పనిచేసేవారని అమిత్‌షా అన్నారు.

అప్పటి ప్రధానమంత్రి నియంతృత్వ ఆలోచనలను వ్యతిరేకించింది 25 ఏళ్ల యువకుడని కేంద్ర హోం మంత్రి అన్నారు. కుటుంబ రాజకీయాలను మళ్లీ తెచ్చేందుకు అత్యవసర పరిస్థితిని విధించారు కానీ ఇంటింటికీ, గ్రామ గ్రామానికీ, ప్రతి నగరానికీ మోదీ వెళ్లి నిరసన తెలిపారు. చివరకు ఆయనే 2014లో దేశంలో కుటుంబ రాజకీయాలను నిర్మూలించారు. మీడియా సెన్సార్‌షిప్, ప్రభుత్వ అణచివేత.. సంఘ్, జనసంఘ్ పోరాటం.. అత్యవసర పరిస్థితి బాధితుల వివరణలు, నియంతృత్వం ధోరణి నుంచి ప్రజా భాగస్వామ్యం వరకు.. ఇలా ఈ పుస్తకంలో అయిదు అధ్యాయాలు ఉన్నాయని అమిత్ షా తెలిపారు.

యువత ఈ పుస్తకాన్ని చదవాలని హోం మంత్రి కోరారు. తద్వారా తొలినాళ్లలో నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాడిన ఆ యువకుడే ఈ దేశంలో ప్రజాస్వామ్య మూలాలను బలోపేతం చేస్తున్నారని, ఆయనే మన ప్రధానమంత్రి అని తెలుసుకుంటారని అన్నారు.

# మీ ఇండ్ల బిల్లుల కోసం.. అవసరమైతే నా ఇల్లు కూడా అమ్ముతా : మంత్రి వాకిటి శ్రీహరి




మహబూబ్‌నగర్, జూన్ 27:ఇండ్ల నిర్మాణం ఎంత త్వరగా ప్రారంభిస్తారో అంత త్వరగా మీకు మీ అకౌంట్లో బిల్లులు పడతాయని, ఒకవేళ మీకు బిల్లులు పడనియెడల అవసరమైతే నా ఇల్లు అమ్మైనా మీ ఇంటి నిర్మాణాలను పూర్తి చేసే బాధ్యత నాది అని రాష్ట్ర పశుసంవర్ధక క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. తాను ఈరోజు మీ ముందు ఈ స్థాయిలో నిలబడి మాట్లాడుతున్న అంటే నాపైన మీరు చూపించినటువంటి ప్రేమ, ఆదరాభిమానాలకు నేను నా జీవితాంతం అన్నగా, తమ్ముడిగా, కొడుకుగా, మీ విధేయునిగా నిరంతరం పనిచేస్తానన్నారు.

రానున్న రోజుల్లో మొత్తం అభివృద్ధి రూపురేఖలు మారిపోతున్నాయన్నారు. అందులో భాగంగానే నేడు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేస్తున్నామన్నారు. ఇవాళ మధ్యాహ్నం మక్తల్ పట్టణంలోని ఎంఆర్ ఫక్షన్ హాల్ లో మక్తల్ మున్సిపాలిటీకి సంబంధించిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తో కలిసి మంత్రి పంపిణీ చేశారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల, మతాలకు, పార్టీలకు అతీతంగా ఇల్లు కట్టుకోలేని బీద పరిస్థితిలో ఉన్న వారికి, బరకం కప్పుకున్న వారికి, పేదింటి వారికి సొంత ఇంటి కల నెరవేరాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను ఇస్తోందన్నారు. రానున్న రోజుల్లో మొత్తం అభివృద్ధి రూపురేఖలు మారిపోతున్నాయన్నారు. అందులో భాగంగానే నేడు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేస్తూ, నియోజకవర్గ అభివృద్ధి కోసం రానున్న రోజుల్లో సుమారు రూ.600 కోట్ల నిధులను తీసుకువచ్చి నియోజకవర్గ అభివృద్ధి రూపురేఖలను మార్చి చూపిస్తానని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో మక్తల్ మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తల సంబంధిత అధికారులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# 48వ ప్రగతి సమావేశానికి అధ్యక్షత వహించిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జూన్ 27:కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రయత్నాలను సజావుగా సమన్వయం చేయడం ద్వారా ముందుచూపుతో కూడిన పాలన అందించడం సకాలంలో పనులను పూర్తి చేయడం లక్ష్యంగా ఏర్పాటైన ఐసీటీ ఆధారితమల్టీ-మోడల్ వేదిక 'ప్రగతి' 48వ సమావేశం ఈరోజు ఉదయం సౌత్ బ్లాకులో నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షత వహించారు.

గనులు, రైల్వేలు, జలవనరుల శాఖలకు సంబంధించిన పలు కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ప్రధానమంత్రి ఈ సమావేశంలో సమీక్షించారు. కాలపరిమితులు, సంస్థల మధ్య సమన్వయం, సమస్యల పరిష్కారం వంటి అంశాలపై ప్రధానంగా దృష్టి సారిస్తూ.. ఆర్థికవృద్ధికీ, ప్రజా సంక్షేమానికీ కీలకమైన ఈ ప్రాజెక్టుల పురోగతిని ప్రధానమంత్రి సమీక్షించారు.

ప్రాజెక్టుల అమలులో జాప్యం వల్ల ఆర్థిక వ్యయం పెరగడం, పౌరులకు అవసరమైన సేవలు, మౌలిక సదుపాయాలు సకాలంలో లభించకపోవడం వంటి రెండు నష్టాలు ఉంటాయని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. అవకాశాలను జీవితాలను మెరుగుపరిచేవిగా మార్చుకునేందుకు ఫలితాల ఆధారిత విధానాన్ని అవలంబించాలని కేంద్ర, రాష్ట్ర స్థాయి అధికారులను ఆయన కోరారు.

ప్రధానమంత్రి-ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మౌలిక సదుపాయాల మిషన్ (పీఎమ్-ఏబీహెచ్ఐఎమ్) గురించిన సమీక్ష సందర్భంగా.. అన్ని రాష్ట్రాలు ఆరోగ్య మౌలిక సదుపాయాల అభివృద్ధిని వేగవంతం చేయాలనీ, ఆకాంక్షాత్మక జిల్లాలు, మారుమూల, గిరిజన, సరిహద్దు ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ప్రధానమంత్రి కోరారు. పేదలు, అణగారిన, వెనుకబడిన జనాభా కోసం నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ అందరితో సమానంగా అందుబాటులో ఉండేలా చూసుకోవాలని ఆయన సూచించారు. ఈ ప్రాంతాల్లో కీలకమైన ఆరోగ్య సేవల్లో ఉన్న అంతరాలను తగ్గించడం కోసం అవసరమైన తక్షణ, నిరంతర ప్రయత్నాలు ప్రారంభించాలని పిలుపునిచ్చారు.

రాష్ట్రాలు తమ ప్రాథమిక, తృతీయ, ప్రత్యేక ఆరోగ్య మౌలిక సదుపాయాలను మండల, జిల్లా, రాష్ట్ర స్థాయుల్లో బలోపేతం చేసుకోవడానికి.. నాణ్యమైన ఆరోగ్య సంరక్షణను, సేవలను అందించడానికి పీఎమ్-ఏబీహెచ్ఐఎమ్ ఒక సువర్ణావకాశాన్ని అందిస్తుందని ప్రధానమంత్రి స్పష్టం చేశారు.

రక్షణ రంగంలో స్వయంసమృద్ధిని పెంపొందించడంలో వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలు, రాష్ట్రాలు-కేంద్రపాలిత ప్రాంతాలు అనుసరించిన ఆదర్శప్రాయమైన పద్ధతులను ప్రధానమంత్రి సమీక్షించారు. రక్షణ రంగంలో వ్యూహాత్మక ప్రాముఖ్యత, ఆవిష్కరణలను ప్రోత్సహించే సామర్థ్యం గలవిగా ఈ కార్యక్రమాలను ఆయన ప్రశంసించారు. వాటి విస్తృత ఔచిత్యాన్ని వివరిస్తూ..పూర్తి స్వదేశీ సామర్థ్యాలతో అమలు చేసిన ఆపరేషన్ సిందూర్ విజయం రక్షణ రంగంలో భారత్ స్వయంసమృద్ధికి శక్తిమంతమైన నిదర్శనంగా నిలుస్తుందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడానికి, రక్షణ రంగంలో స్వయంసమృద్ధికి ఊతమివ్వడానికి రాష్ట్రాలు ఈ అవకాశాన్ని ఎలా ఉపయోగించుకోవచ్చో ప్రధానమంత్రి వివరించారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



పాలకుర్తి , జూన్ 27: ఇల్లు అన్నది ప్రతి ఒక్కరి జీవితంలో ఒక ప్రధానమైన అవసరం. నిరుపేదలకు ఇండ్లు కట్టించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే యశస్విని రెడ్డిఅన్నారు. శుక్రవారం పాలకుర్తి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పట్టాలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగాఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇది కేవలం గృహం కాదు, ప్రతి కుటుంబానికి ఆత్మగౌరవాన్ని తీసుకొచ్చే ఆశ్రయం అన్నారు.

అలాగే, లబ్ధిదారులు పక్కా ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అందించే సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇంటి నిర్మాణంలో పారదర్శకత, నాణ్యత కచ్చితంగా పాటించాలన్నారు. ప్రభుత్వ నిధులు అర్హులైన వారికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షైక్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# 'సంవిధాన్ హత్యా దివస్' సందర్భంగా ప్రజాస్వామ్య రక్షకులకు ప్రధానమంత్రి నివాళులు

న్యూఢిల్లీ, జూన్ 27:దేశంలో ఎమర్జెన్సీ (అత్యవసర పరిస్థితి)ని విధించిన ఘట్టానికి 50 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా, దేశ చరిత్రలో చిమ్మచీకటి కమ్ముకొన్న అధ్యాయాల్లో ఒకటి కొనసాగిన కాలంలో ప్రజాస్వామ్యాన్ని రక్షించడంలో ఎదురొడ్డి నిలిచిన అసంఖ్యాక భారతీయులకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు హృదయపూర్వక నివాళులు అర్పించారు.

రాజ్యాంగ విలువలపై తీవ్ర దాడి జరగడాన్ని ప్రధానమంత్రి గుర్తు చేస్తూ, జూన్ 25ను 'సంవిధాన్ హత్యా దివస్' (రాజ్యాంగాన్ని హత్య చేసిన రోజు)గా మనం పాటించుకొంటున్నామన్నారు. ఇది ఒక ఎలాంటి రోజంటే– ఆనాడు ప్రాథమిక హక్కులను నిలిపేశారు, పత్రికా స్వేచ్ఛను అంతం చేశారు, ఎంతో మంది రాజకీయ నేతలను, సామాజిక కార్యకర్తలను, విద్యార్థులతో పాటు సామాన్య పౌరులను జైళ్లలోకి నెట్టివేశారు.

మన రాజ్యాంగ సిద్ధాంతాలను పటిష్ఠపరచుకోవడంతో పాటు 'వికసిత్ భారత్' (అభివృద్ధి చెందిన భారతదేశం) దార్శనికతను సాకారం చేసుకోవడానికి మనం కలిసికట్టుగా పనిచేయాలన్న అంశానికి కూడా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ తన నిబద్ధతను మరోసారి చాటారు.

ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా సాగిన ఉద్యమం పాఠాన్ని నేర్చుకోవలసిన అనుభవం, ఇది మన ప్రజాస్వామ్య వ్యవస్థ స్వరూపాన్ని సంరక్షించుకొనేందుకున్న ప్రాధాన్యాన్ని పునరుద్ఘాటించింది అని కూడా ప్రధానమంత్రి అన్నారు.

అత్యవసర పరిస్థితి కాలం నాటి చీకటి రోజుల పీడకలలు ఇప్పటికీ ఇంకా తమను వెన్నాడుతున్న వ్యక్తులు గాని లేదా ఆ కాలంలో యాతనలకు గురైన కుటుంబాల సభ్యులు గాని తమ జ్ఞాపకాలను సామాజిక మాధ్యమాల్లో పంచుకోవాల్సిందిగా శ్రీ మోదీ పిలుపునిచ్చారు. ఇలా చేస్తే 1975 నుంచి 1977 మధ్య కాలపు సిగ్గుచేటైన కాలాన్ని గురించి మన దేశ యువతలో అవగాహనను కలిగించవచ్చని ఆయన అన్నారు.

సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పొందుపరిచిన అనేక సందేశాల్లో ప్రధానమంత్రి ఇలా పేర్కొన్నారు:

"భారత్ ప్రజాస్వామ్య చరిత్రలో చిమ్మ చీకటి కమ్ముకొన్న ఓ అధ్యయమైన అత్యవసర పరిస్థితిని అమలు చేసిన తరువాత, ఈ రోజుతో యాభై సంవత్సరాలు పూర్తి అయ్యాయి. ఈ రోజును 'సంవిధాన్ హత్యా దివస్ ' (రాజ్యాంగాన్ని హత్య చేసిన రోజు)గా భారత్ ప్రజలు పాటిస్తున్నారు. భారత రాజ్యాంగంలో ఉల్లేఖించుకొన్న విలువలను పక్కన పెట్టేసింది.. ప్రాథమిక హక్కులను నిలిపేసింది.. పత్రికా స్వేచ్ఛను అంతం చేసింది.. అనేకమంది రాజకీయ నేతలను, సామాజిక కార్యకర్తలను, విద్యార్థులతో పాటు సామాన్య పౌరులను కూడా జైళ్లలోకి నెట్టేసింది.. ఇవన్నీ జరిగిన రోజు ఇదే. ఆ కాలంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని బందీని చేసేసిందా అని అనిపించింది.

"మన రాజ్యాంగ స్ఫూర్తిని ఏ విధంగా ఉల్లంఘించారో, పార్లమెంటు వాణిని ఎలా అణచివేశారో, న్యాయ స్థానాలను నియంత్రణలో పెట్టుకొనేందుకు ఎలాంటి ప్రయత్నాలు జరిగాయో దేశంలోని ప్రతి ఒక్కరూ ఎప్పటికీ మరచిపోలేరు. 42వ సవరణ అప్పటి పాలకుల వంచనకు, కపటానికి ఒక ప్రధాన ఉదాహరణ. పేదలను, పీడితులను, తాడితులను తమ ముఖ్య లక్ష్యాలుగా ఎంచుకొన్నారు. వారి ఆత్మగౌరవాన్ని అవమానించడం కూడా దీనిలో ఓ భాగంగా ఉంది.

"అత్యవసర స్థితికి ఎదురొడ్డి నిలిచి పోరాడిన ప్రతి ఒక్క వ్యక్తికి మనం నమస్కరిద్దాం. వీరు దేశం నలుమూలల్లో వేర్వేరు ప్రాంతాలకు చెందిన వారు, ప్రతి రంగం నుంచి కదిలి ముందుకు వచ్చిన వారు, వివిధ ఆలోచనావిధానాలు కలిగి ఉన్న వారు.. వీరందరూ భుజం భుజం కలిపి పనిచేశారు.. వీరందరిదీ ఒకే ధ్యేయం.. అది, భారతదేశ ప్రజాస్వామిక యవనికను కాపాడడం.. మన స్వాతంత్ర్య సమర యోధులు తమ జీవితాలను అంకితం చేసిన ఆదర్శాలను పరిరక్షించడం. వారి సామూహిక సంఘర్షణే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించడంతో పాటు కొత్తగా ఎన్నికలను నిర్వహించేటట్లుగా చేసింది.. ఆ ఎన్నికల్లో వారు ఘోర పరాజయం పాలయ్యారు.

"మన రాజ్యాంగ సిద్ధాంతాలను బలపరచాలన్న నిబద్ధతతో పాటు 'వికసిత్ భారత్' సాధన దిశగా పయనించాలన్న మన ఆశయాన్ని సాధించుకోవడానికి మనమంతా కలిసికట్టుగా కృషిచేద్దామని కూడా మరోసారి చాటిచెబుదాం.

పేదలు, అణగారిన వర్గాల కలలను పండించడంతో పాటు నూతన ప్రగతి శిఖరాలను అధిరోహించాలని నేను కోరుకుంటున్నాను."ఎమర్జెన్సీని విధించినప్పుడు, ఆర్ఎస్ఎస్ యువ ప్రచారక్‌లలో నేనూ ఒకరుగా ఉన్నాను. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా సాగిన ఉద్యమం నాకు అనేక విషయాలను నేర్పించింది. మన ప్రజాస్వామ్య వ్యవస్థ స్వరూపాన్ని సంరక్షించుకోవడానికి ఉన్న ప్రాధాన్యాన్ని ఆ ఉద్యమం పునరుద్ఘాటించింది. అదే కాలంలో, రాజకీయ రంగంలో ఉన్న వారి వద్ద నుంచి ఎన్నో అంశాలను నేర్చుకొనే అవకాశం నాకు లభించింది. కొన్ని అనుభవాలను పుస్తక రూపంలో బ్లూక్రాఫ్ట్ డిజిటల్ ఫౌండేషన్ (ఃశ్రీబీవఐతీజీటబి ఆతిణతిబిజీశ్రీ ఈ నీ బీ ని ట జీ బి తి నీ ని ) తీసుకువచ్చినందుకు నేను సంతోషిస్తున్నాను. ఈ పుస్తకానికి ముందుమాటను శ్రీ హెచ్.డి. దేవె గౌడ గారు రాశారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా ఉద్యమించిన దిగ్గజాల్లో ఆయనా ఒకరు.

"ఎమర్జెన్సీ అమలైన కాలంలో నా జీవన యాత్రను 'ద ఎమర్జెన్సీ డైరీస్' వివరిస్తుంది. అది ఆ కాలంలోని అనేక జ్ఞాపకాలను మళ్లీ ఓసారి గుర్తుకు తెచ్చింది.

అత్యవసర పరిస్థితి కాలం నాటి చీకటి రోజుల పీడకలలు ఇప్పటికీ ఇంకా తమను వెన్నాడుతున్న వ్యక్తులు గాని లేదా ఆ కాలంలో యాతనలకు గురైన కుటుంబాల సభ్యులు గాని తమ జ్ఞాపకాలను సామాజిక మాధ్యమాల్లో పంచుకోవాల్సిందిగా వారికి నేను పిలుపునిస్తున్నాను. ఈ పనిని చేయడం వల్ల 1975 నుంచి 1977 మధ్య కాలపు సిగ్గుచేటైన కాలాన్ని గురించి మన దేశ యువతలో అవగాహనను ఏర్పడుతుంది.

# ఎంఎంటీఎస్ రైలు ఢీకొని యువకుడు మృతి

హైదరాబాద్, జూన్ 27: ఎంఎంటీఎస్ రైలు ఢీకొని గుర్తుతెలియని యువకుడు మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. హెడ్ కానిస్టేబుల్ రవికుమార్ వివరాల ప్రకారం.. గుర్తుతెలియని యువకుడు(30)గురువారం అర్ధరాత్రి కాచిగూడ-మలక్ పేట రైల్వే స్టేషన్‌ల మధ్య పట్టాలు దాటుతుండగా అదే సమయంలో ఎదురుగా వచ్చిన ఎంఎంటిఎస్ రైలు ఢీకొనడంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవఖానకు తరలించారు. ఒంటిపై లేత నీలిరంగు జీన్స్ పాయింట్, నీలిరంగు చొక్కా ధరించి, ఎత్తు 5.5 ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వివరాల కోసం 9573948545 లో సంప్రదించాలని హెచ్ సి రవికుమార్ కోరారు.

# భద్రాద్రి రామయ్యకు వెండి కవచాలను బహూకరించిన భక్తుడు



భద్రాచలం, జూన్ 27: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానానికి ఓ భక్తుడు భారీ విరాళం సమర్పించారు. తన భక్తిభావాన్ని చాటుకుంటూ సుమారు రూ. 12 లక్షల విలువైన వెండి కవచాలను స్వామివారికి కానుకగా అందజేశారు. వివరాల్లోకి వెళితే సంతోష్ కుమార్ రెడ్డి, సాహిత్య దంపతులు 9 కేజీల వెండితో సీతారామ లక్ష్మణులకు కవచాలను ప్రత్యేకంగా తయారు చేయించారు. స్వామివారికి శుక్రవారం ఉదయం ప్రత్యేక పూజలు చేసి వాటిని సమర్పించారు. భక్తిశ్రద్ధలతో సమర్పించిన ఈ కానుకను ఆలయ అధికారులు స్వీకరించి, దాతకు స్వామివారి ఆశీస్సులు అందజేశారు. ఈ వెండి కవచాలను స్వామివారి అలంకరణ కైంకర్యాలకు వినియోగిస్తామని వారు తెలిపారు.

భద్రాద్రి రామయ్యపై భక్తులకు ఉన్న అపారమైన విశ్వాసానికి, భక్తికి ఇది నిదర్శనమని ఆలయ వర్గాలు పేర్కొన్నాయి. ఇలాంటి విరాళాలు క్షేత్ర అభివృద్ధికి, నిత్య కైంకర్యాల నిర్వహణకు ఎంతగానో దోహదపడతాయని అధికారులు హర్షం వ్యక్తం చేశారు. తమ ఇలవేల్పు అయిన సీతారామచంద్రస్వామికి తమకు తోచిన రీతిలో కానుకలు సమర్పించడం ద్వారా భక్తులు తమ మొక్కులు తీర్చుకుంటూ ఉంటారు. ఈ క్రమంలోనే దాతృత్వం చాటుకున్న సదరు భక్తుడిని పలువురు అభినందించారు.

# మోహిని చెరువు స్మశాన వాటిక అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి : ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



హైదరాబాద్, జూన్ 27: బాగ్ అంబర్‌పేట డివిజన్ పరిధిలోని మోహిని చెరువు హిందూ శ్మశాన వాటికను డివిజన్ కార్పొరేటర్ పద్మా వెంకట్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులను పరిశీలించారు. స్మశాన వాటికలో రూ. 2.75 కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని స్వయంగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇందులో అస్తికలు దాచేందుకు ఒక రూము, కాంపౌండ్ వాల్ పై షీట్లు, టాయిలెట్స్ ల నిర్మాణం, స్మశాన వాటికకు వచ్చిన వారు కూర్చునేందుకు బల్లలు తదితర పనులను చేస్తున్నారు. వీటిని పరిశీలించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులను పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అంత్యక్రియలకోసం వచ్చే ప్రజలకు అవసరమైన ప్రాథమిక సౌకర్యాలు తప్పకుండా అందుబాటులో ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇంజనీర్ ప్రశాంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి, పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# టెక్నాలజీతో అభివృద్ధి వైపు అడుగులు : సీఎం చంద్రబాబు

అమరావతి, జూన్ 27:గుంటూరు జిల్లాలో ఖీఎఖీ ఏఅ కళాశాల ఇన్నోవేషన్ సెంటర్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పోలీస్ ఓఎ హ్యాకథాన్-2025లో సీఎం ప్రత్యేకంగా పాల్గొన్నారు. యువతలో కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి, కృత్రిమ మేధస్సు ఆధారంగా పోలీసింగ్‌ను మెరుగుపరచడానికి ఈ హ్యాకథాన్ నిర్వహించారు. ముఖ్యమంత్రి తన సందేశంలో యువతను నూతన ఆవిష్కరణలు చేయాలని ప్రోత్సహిస్తూ.. టెక్నాలజీ ద్వారా అభివృద్ధి వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు.

# నా ఫోన్ కూడా ట్యాప్ చేశారు!.. మంత్రి జూపల్లి




**-తలతిక్క పనులతోనే కుప్పకూలిన బీఆర్ఎస్ సర్కార్**
**-ఉమ్మడి ఆదిలాబాద్ రాజకీయ ముఖచిత్రాన్ని మారుస్తా**
**-ఆదిలాబాద్ రిమ్స్ అధ్వానం**

ఆదిలాబాద్, జూన్ 27:కేసీఆర్ ప్రభుత్వంలో తన ఫోన్ కూడా ట్యాపింగ్ జరిగిందని, తల తిక్క పనులతోనే ప్రజలు ఆ ప్రభుత్వాన్ని తిరస్కరించారని, అందుకే కుప్పకూలి పోయిందని రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్ లు చేయడం ఆదర్శ పాలన ఎట్లా అవుతుందనీ ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో పాటు ఇతర అంశాల్లో కూడా కేసీఆర్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారన్నారు.

### రాజకీయ ముఖచిత్రాన్ని మారుస్తాం..

ఎన్నికలు ఏవైనా కాంగ్రెస్ పార్టీ అధిక స్థానాలను కైవసం చేసుకుంటుందనే పూర్తి విశ్వాసం ఉందనీ మంత్రి జూపల్లి అన్నారు. పరిపాలన ద్వారా ఉమ్మడి జిల్లాలో కచ్చితంగా మార్పులు తెస్తామన్నారు. నాయకుల మధ్య విభేదాలు ఉంటే.. వాటిని తొలగించేందుకు కృషి చేస్తామన్నారు. అందరం కలిసి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు బీజేపీకి లేదన్నారు.

### తెలంగాణకు బీజేపీ చేసేందేమీ లేదు

తెలంగాణకు బీజేపీ చేసిందేమి లేదని మంత్రి అన్నారు. ఆనాడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మూడు రాష్ట్రాలను ఇచ్చి రాజకీయ ప్రయోజనాల కోసం తెలంగాణ రాష్ట్రాన్ని ఇవ్వలేదని, ఈనాడు కూడా నిధుల కేటాయింపులో తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం చేస్తుందన్నారు. బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు అధిక నిధులు కేటాయిస్తూ.. తెలంగాణకు మొండి చేయి చూపుతున్నారని, తెలంగాణలోని ఏ ప్రాజెక్టుకు కూడా జాతీయ హోదా ఇవ్వలేదని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా నష్టం జరుగుతుందని తెలిసి, తెలంగాణ బిడ్డల ప్రాణ త్యాగాలను చూసి మానవీయ కోణంలో సోనియా గాంధీ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చారని గుర్తు చేశారు. అయితే కొట్లాడి సాధించుకున్న తెలంగాణను గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధ్వంసం చేసిందని మండిపడ్డారు. అవినీతి, నిర్బంధ, కుటుంబ, అప్రజాస్వామిక పాలనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, రాష్ట్రం అప్పులకుప్పగా మారిందన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా గత ప్రభుత్వ పథకాలను కొనసాగిస్తూనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నారు.

### ఆదిలాబాద్ రిమ్స్ అధ్వానం

ఆదిలాబాద్ లోని రాజీవ్ గాంధీ మెడికల్ కళాశాల లో అపరిశుభ్రతతో రోగులు ఇక్కట్లు పడుతున్నా పట్టించుకోవడం లేదని రాష్ట్ర ఎక్సైజ్ టూరిజం మంత్రి జూపల్లి కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రిమ్స్ ఆస్పత్రిని సందర్శించి ఐసీయూ, బ్లడ్ బ్యాంక్, జనరల్ అవుట్ పేషెంట్స్ విభాగాన్ని పరిశీలించారు. ఆస్పత్రిలో అడుగడుగునా అపరిశుభ్రత నెలకొనడం చూసి మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. రిమ్స్ పారిశుద్ధ్య కాంట్రాక్టర్ పై వెంటనే చర్యలు తీసుకోవాలని డీన్ ను ఆదేశించారు. మంత్రి జూపల్లి రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ని సందర్శించి రోగుల బాగోగులను అడిగి తెలుసుకున్నారు.

### యాంటీ డ్రగ్స్ పై పోలీసుల 5 కె రన్

మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం నిర్వహించిన 5కె రన్ కు విశేష స్పందన లభించింది. డ్రగ్స్ పై ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా యుద్ధం చేయాలని మంత్రి జూపల్లి పిలుపునిచ్చారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుండి నిర్వహించిన భారీ పరుగు ర్యాలీలో మంత్రి జూపల్లి, ఎంపీ నగేష్, కలెక్టర్ రాజార్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఎస్పీ కాజల్ సింగ్, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, వేడమ బొజ్జు, ఎమ్మెల్సీ దండే విట్టల్, రిమ్స్ మెడికోలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రుద్రంగి ఎస్ఐగా బి. శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ

కరీంనగర్, జూన్ 27: రుద్రంగి మండల ఎస్ఐగా బీ శ్రీనివాస్ శుక్రవారం పోలీస్ స్టేషన్ లో బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన ఇంచార్జ్ ఎస్ఐ మోతిరాం వేములవాడ టౌను బదిలీ కాగా వేములవాడ టౌన్ ప్రొబిషనరీ ఎస్ఐగా విధులు నిర్వహించిన బీ శ్రీనివాస్ శుక్రవారం రుద్రంగిలో బాధ్యతలు స్వీకరించారు.

ఈ సందర్భంగా బీ శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణ, సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణ మండల ప్రజలు సహకరించాలని కోరారు.

# పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలో మరో దారుణం

**- ఆర్జీకర్ ఆస్పత్రికలో జూనియర్ వైద్యురాలిపై సామూహిక అత్యాచారం**

కోల్‌కతా జూన్ 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలో మరో దారుణం చోటు చేసుకుంది. ఆర్జీకర్ ఆస్పత్రికలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన దారుణం మరువక ముందే మరో విద్యార్థినిపై సామూహిక అత్యాచారం జరిగింది. ఈ ఘటన ప్రస్తుతం దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. కస్బాలోని సౌత్ కోల్‌కతా లా కళాశాలలో ఈ నెల 25వ తేదీన ముగ్గురు వ్యక్తులు సెక్యూరిటీ రూంలో బాధితురాలిపై అత్యాచారానికి ఒడిగట్టారు. వారిలో ఇద్దరు సిబ్బంది కాగా, మరొకరు పూర్వ విద్యార్థి అని పోలీసులు తెలిపారు. ఘటన జరిగిన మరుసటి రోజు దీనిపై కేసు నమోదు కాగా.. నిందితులను అదుపులోకి తీసుకున్నామని పేర్కొన్నారు. పెళ్లికి నిరాకరించిందనే నిందితులు ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బాధితురాల వైద్యుల పర్యవేక్షణలో ఉంది. ఆమె నుంచి పోలీసులు వాంగ్మూలం తీసుకున్నారు. నిందితులలో ఒకరు మోనోజిత్ మిశ్రా (31) తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వ్యక్తి కావడంతో రాజకీయంగా దుమారం రేగింది. మరో ఇద్దరు జైబ్ అహ్మద్ (19), ప్రమిత్ ముఖర్జీ (20) అని తెలుస్తోంది. నిందితులకు ప్రస్తుతం ఐదు రోజుల కస్టడీ విధించారు. ఈ ఘటనపై బిజెపి నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మమతా బెనర్జీ పాలనలో ఆడవాళ్లకు భద్రత కరువైందని.. పశ్చిమ బెంగాల్‌లో ఇలాంటి దారుణాలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయని బిజెపి నేత అమిత్ మాలవీయా ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# బనకచర్లపై పిపిటి పేరుతో సిఎం రేవంత్ రెడ్డి కాలయాపన: హరీష్ రావు

హైదరాబాద్ జూన్ 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: బనకచర్లపై పిపిటి పేరుతో సిఎం రేవంత్ రెడ్డి కాలయాపన చేస్తున్నారని బిఆర్ఎస్ మాజీ మంత్రి హరీష్ రావు తెలిపారు. డైవర్షన్ కోసమే ప్రజాప్రతినిధులకు సిఎం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 2016 ఎజెండా మినిట్స్ పై రేవంత్ తో చర్చకు సిద్ధం అని అన్నారు. తెలంగాణకు ఆమోదయోగ్యం లేకుంటే ఒప్పుకునేది లేదని, బనకచర్ల పై జలశక్తి మీటింగ్ లో తెలంగాణ వాదన గట్టిగా విన్పించాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. కేంద్రంలో తనకున్న పలుకుబడితో ఎపి సిఎం చంద్రబాబు నాయుడు తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకుంటున్నారని ధ్వజమెత్తారు. బిఆర్ఎస్ హయాంలో బనకచర్ల కార్పొరేషన్ లేదని, టెండర్లు పిలవలేదని విమర్శించారు. తెలంగాణకు నష్టం జరగకముందే బనకచర్లను ఆపేలా కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ చర్యలు తీసుకోవాలని సూచించారు. బనకచర్లపై రైతులతో కలిసి సుప్రీంకోర్టును ఆశ్రయిస్తాం అని హరీష్ రావు పేర్కొన్నారు.

# ఆశ్రమ పిల్లల తరలింపులో హైడ్రామా.. ఆధారాలతో వస్తేనే అప్పగిస్తామన్న అధ్యాపకులు

**-గంటల పాటు ఉపాధ్యాయుల విధులకు ఆటంకం**
**-చివరకు నాటకీయ పరిణామాల మధ్య తరలింపు**



కరీంనగర్, జూన్ 27:గోదావరిఖని నగరంలోని ఓ బాలల సంరక్షణ కేంద్రంలోని అనాథ పిల్లల తరలింపులో అనేక నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. బాల రక్షక్ సంస్థ నుంచి వచ్చామని చెప్పిన అధికారులు ముందుగా ఆశ్రమంకు చేరుకొని వాకబు చేశారు. ఆశ్రమ నిర్వాహకుడు అందుబాటులో లేకపోవడంతో అక్కడ నుంచి పిల్లలు చదివే గాంధీ పార్క్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్దకు చేరుకున్నారు. తాము బాల రక్షక్ సంస్థ నుంచి వచ్చామనీ, ఆశ్రమ పిల్లలను స్వాధీనం చేసుకుంటున్నట్లు చెప్పడంతో పాఠశాల అధ్యాపకులు, హెచ్ఎం ఆధారాలు చూపించాలని ప్రశ్నించారు. దీంతో కంగారు పడ్డ బాలల రక్షక్ అధికారులు ఓ తెల్ల కాగితంపైన రాసిచ్చారు. కలెక్టర్ నుంచి గానీ, డీఈఓ నుంచి ఏమైనా నోటీసులు ఉంటే చూపిస్తేనే పిల్లలను అప్పగిస్తామని ఉపాధ్యాయులు తేల్చి చెప్పారు. దీంతో బాలల సంరక్షణ సంస్థ అధికారులు, ఉపాధ్యాయుల మధ్య రెండు గంటల పాటు తీవ్ర వాగ్వాదం చోటుచేసుకొంది. పాఠశాల పని వేళలో వచ్చి విధులకు ఆటంకం కలిగించవద్దని చెప్పినా వినిపించుకోలేదు. ఈ సంఘటనతో పాఠశాల ఆవరణలో ఉద్రిక్తత వాతావరణంకు దారితీసింది. ఉపాధ్యాయులు, విద్యార్థులు అంతా గుమిగూడటంతో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. కనీసం ఐడెంటి కార్డులు చూపించమని అడిగినా చూపించలేదు. ఆశ్రమానికి అనుమతులు లేవని, పిల్లలను తాము స్వాధీనం చేసుకొని పెద్దపల్లి సంరక్షణ కేంద్రంకు తరలిస్తామని చెప్పగా, పాఠశాల సమయంలో తాము అప్పగించమని, ఏదైనా అధికారికంగా నోటీసు ఉంటె చూపించాలని హెచ్ఎం అభ్యంతరం తెలిపారు. దీంతో వచ్చిన వారు అక్కడే పాఠశాల ముగిసేవరకు వేచి ఉండి పిల్లలను వాహనంలో ఎక్కించుకొని చివరకు అనేక నాటకీయ పరిణామాల మధ్య వెంట తీసుకవెళ్లారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకుడు రాజయ్య మాట్లాడుతూ తమ ఆశ్రమానికి అన్ని అనుమతులు ఉన్నాయనీ, హైకోర్టు ఉత్తర్వులను కూడా ధిక్కరించి ఉద్దేశ పూరితంగానే పిల్లలను తీసుకవెళ్లారనీ, తాను అందుబాటులో లేనిది చూసి ఆశ్రమంకు వచ్చి వార్డెన్ ను కూడా బలవంతంగా నెట్టివేశారని ఆరోపించారు. పాఠశాల ఉపాధ్యాయులను అడగగా, వచ్చిన వారు ఎవరో కూడా చెప్పడం లేదనీ, ఏలాంటి నోటీసులు కూడా చూపించలేదనీ, ఓ తెల్ల కాగితంపై వైల్డ్ వెల్ఫేర్ అని రాసిచ్చి బలవంతంగా తీసుకవెళ్లారని పేర్కొన్నారు. అప్పటికే తాము జిల్లా విద్యాధికారి దృష్టికి తీసుకవెళే, అధికారికమైన నోటీసులు చూపించి నిర్ధారించుకున్నాకే పిల్లలను అప్పగించాలని చెప్పారన్న విషయం కూడా వివరించి నఅత్యుత్సాహం కనబరిచి ససె మిరా అంటూ పిల్లలను తీసుకువెళ్లారని వాపోయారు.

# డిజిటల్ హంగు సమకూర్చుకున్న స్టాఫ్ సెలక్షన్ కమిషన్..

న్యూఢిల్లీ, జూన్ 27:మంత్రిత్వ శాఖలకు, విభాగాలకు ఎంపికైన అభ్యర్థుల డాక్యుమెంట్లను పంపడానికి కాగితాల రూపంలోని వివరణాత్మక ఫైళ్లకు బదులు ఎలక్ట్రానిక్ డాసియర్లను (ఇ-డాసియర్లు) ఉపయోగించే దిశగా స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) ముందడుగు వేసింది. ఇది 'డిజిటల్ ఇండియా' దార్శనికతకు అనుగుణంగా కూడా ఉంది. మంత్రిత్వ శాఖలకు, విభాగాలకు, ఇతర ప్రభుత్వ సంస్థలకు వివరణాత్మక ఫైళ్లను అందించే ప్రక్రియను ఎస్ఎస్‌సీ 'ఇ-డాసియర్' పోర్టల్‌ను ఉపయోగించుకొంటూ, పూర్తిగా డిజిటలీకరించింది. వివిధ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యే అభ్యర్థుల వివరణాత్మక ఫైళ్లను ఎస్ఎస్‌సీ ప్రస్తుతం ఎలక్ట్రానిక్ మాధ్యమం ద్వారా సంకలనపరుస్తోంది. వాటిని ఉద్యోగ నియామకానికి ముందస్తుగా ఉండే కొన్ని లాంఛనాలను వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాల నోడల్ అధికారులు మొదలుపెట్టడానికి వీలుగా, వారు డౌన్‌లోడ్ చేసుకోవడానికి ఇ-డాసియర్ పోర్టల్‌లో అందుబాటులో ఉంచుతోంది. కాగితం రూపేణా ఉండే ఫైళ్ల పద్ధతి నుంచి ఇ-డాసియర్ల పద్ధతికి మారడంలో ఈ కింద ప్రస్తావించిన ప్రయోజనాలు ఉన్నాయి:

సమాచార సమగ్రత పెరిగింది: నోడల్ అధికారులకు ఇచ్చిన లాగిన్ వివరాలతో మాత్రమే ఇ-డాసియర్లను పరిశీలించడానికి వీలుంది. ఈ పద్ధతిలో అనధికార మార్పుచేర్పుల బెడద తగ్గిపోయింది. దీంతో సమాచార సమగ్రత మరింత పెరిగింది.

కాగిత రూపంలో ఉండే డాసియర్లను కోరుకొనే విధంగా మార్పుచేర్పులకు లోను చేసేందుకు అవకాశం ఉన్నప్పటికీ ఇప్పుడు ఇ-డాసియర్లది డిజిటల్ స్వరూపం కాబట్టి, వీటి విషయంలో ఆ తరహా అవకాశాల ప్రసక్తే తలెత్తదు.

ఉన్నత స్థాయి భద్రత, నియంత్రణ: ఇ-డాసియర్ మాడ్యూల్ అందుబాటు లాగ్ ప్రక్రియ వల్ల సురక్షితంగా మారింది. ఇది ప్రామాణికత్వానికి, పోయిన ఫైళ్లను తిరిగి పొందడానికి ఇదివరకటి కంటే ఎక్కువ సౌలభ్యానికి మార్గాన్ని సుగమం చేసింది.

వేగవంతమైన మరింత సమర్థమైన కమ్యూనికేషన్: డాక్యుమెంట్లను చాలా తక్కువ సమయంలో పంపడానికి, ఉద్యోగ భర్తీ ప్రక్రియను సువ్యవస్థితంగా తీర్చిదిద్దడానికి ఇ-డాసియర్లు తోడ్పడతాయి.

తక్కువ ఖర్చుతో పాటు పర్యావరణ స్థిరత్వం: కాగితాలతో పనిచేయాల్సిన అవసరం లేకపోవడంతో ఖర్చులు తగ్గుతాయి. అంతేకాక, పర్యావరణానికి హాని కలగదు.

ఇ-డాసియర్ వ్యవస్థను ఎస్ఎస్‌సీ తన ప్రధాన ఉద్యోగ నియామక పరీక్షల్లో విజయవంతంగా అమలు చేసింది. ఈ సంస్థ గత సంవత్సరంలో నిర్వహించిన జూనియర్ ఇంజినీర్ పరీక్ష, కంబైన్డ్ హయ్యర్ సెకండరీ స్థాయి పరీక్ష, మల్టి-టాస్కింగ్ స్టాఫ్ పరీక్షలతో పాటు కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ పరీక్ష వంటి ప్రధాన పరీక్షలకు ఈ పద్ధతిని అనుసరించింది. ఎస్ఎస్‌సీ అమలుచేస్తున్న ఈ కార్యక్రమం మంత్రిత్వ శాఖలు, విభాగాలకు, ఎస్ఎస్‌సీకి మధ్య సత్వర, సమర్థ కమ్యూనికేషన్‌కు మాత్రమే కాకుండా, ఉద్యోగ భర్తీ ప్రక్రియల్లో సమగ్రతను పరిరక్షించడానికి, దానిని బలోపేతం చేయడానికి కూడా తోడ్పడుతుంది. అంతేకాక, నియామకానికి సంబంధించిన లాంఛనాలను పూర్తి చేయడానికి పడుతున్న కాలాన్ని చాలావరకు తగ్గించి, లక్షల మంది యువతీయువకులకు ప్రయోజనాన్ని అందించనుంది.


ఆహ్వానం
కిన్నెర ఆర్ట్ థియేటర్స్
ప్రముఖ రచయిత
శ్రీ చిటిప్రోలు సుబ్బారావుగారు
రచించిన
వెన్నెలగింజలు కవితా సంపుటి
ఆవిష్కరణ
శనివారం 28-6-2025, సా॥ 6 గంటలకు
Centre for Economic and Social Studies
Lane Beside Dr Agarwal Eye Hospital
Punjagutta Officers Colony,
Near Punjagutta Metro Station, Hyderabad
ముఖ్యఅతిథి : జస్టిస్ శ్రీ ఎన్.వి. శ్రవణ్ కుమార్, న్యాయమూర్తి, తెలంగాణ హైకోర్టు
అధ్యక్షులు : డా॥ కె.వి.రమణ, ఐఎఎస్ (రి), పూర్వ సలహాదారు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం
విశిష్ట అతిథి : డా॥ వోలేటి పార్వతీశం, ప్రముఖ సాహితీవేత్త
గౌరవ అతిథి : శ్రీ దుర్గంపూడి చంద్రశేఖర్ రెడ్డి, సంపాదకులు, ఎమెస్కో
ఆత్మీయ అతిథి : డా॥ బీరం సుందరరావు, ప్రముఖ రచయిత
సాంస్కృతిక కార్యక్రమం : సా॥ 6 నుండి 6-45 వరకు
నృత్య కిన్నెర సమర్పించు అమృతోత్సవ భారతి కూచిపూడి నృత్య రూపకం
నృత్య దర్శకత్వం: హంస పురస్కార గ్రహీత, కేంద్ర సంగీత నాటక అకాడమి పురస్కార గ్రహీత డా॥ మద్దాళి ఉషాగాయత్రి
సంగీత దర్శకత్వం: శ్రీమతి శ్రీవల్లీ శర్మ
సభానంతరం విందు భోజనం
డా॥ ఆర్. ప్రభాకరరావు, ఐ.పి.ఎస్. (రి) అధ్యక్షులు | సర్వా శ్రీనివాస్ నిర్వాహకులు | మద్దాళి రఘురామ్ కార్యదర్శి

# దివ్యాంగులకు అండగా ప్రభుత్వం : మంత్రి శ్రీధర్ బాబు



మహదేవపూర్ జూన్ 27: దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అలీం కో సంస్థ ద్వారా అందిస్తున్న దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, ఇతర ఉపకరణాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ దివ్యాం గులు సమాజంలో అన్ని రంగాల్లో రాణించేందుకు అవసరమైన సౌకర్యా లు కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలను అందించడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగవుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి అన్ని విధాల కృషి చేస్తుందన్నారు. మండలంలో సుమారు 200 మంది దివ్యాంగులను గుర్తించడం జరిగిందని వారిలో మొదటి విడతలో 50 మంది దివ్యాంగులకు వివిధ రకాలైన బ్యాటరీ ట్రై సైకిళ్లు, సాధారణ ట్రై సైకిళ్లు, వినికిడి పరికరాలు, చేతి కర్రలు, స్టాండ్ లు వారి వారి వైకల్యాన్ని బట్టి అందిస్తున్నామని తెలిపారు.

అంతకు ముందు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో 20 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన డా బి.ఆర్ అంబేద్కర్ చిల్డ్రన్ పార్క్ ను రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, కూడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి లతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయ లక్ష్మి, సంక్షేమ అధికారి మల్లీశ్వరి, ఐసీడీఎస్ సీడీపీఓ రాధిక తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల డిమాండ్లు వంద శాతం న్యాయమైనవి..

## వెంటనే ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలి : బీజేపీ నేత ఎల్లేని సుధాకర్ రావు




మహబూబ్‌నగర్, జూన్ 27:నాలుగు స్తంభాలలో ఒక స్తంభమైన జర్నలిస్టులకు అవమానాలు, అసమానతలు ఎదురవుతున్నాయని జర్నలిస్టులు గొంతెమ్మ కోరికలు కోరడం లేదు.. వారి డిమాండ్లు 100% న్యాయమైనవి.. మంత్రిగా ఉన్న జూపల్లి భేషజాలకు పోకుండా వెంటనే ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్ రావు డిమాండ్ చేశారు. కొల్లాపూర్ పట్టణం ఆర్డీవో కార్యాల యం ఎదుట చేపట్టిన జర్నలిస్టుల రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి మూడో రోజుకు చేరుకున్నాయి. దీక్షలను టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ కృష్ణ ప్రారంభించారు.

ఈ సందర్భంగా దీక్ష శిబిరాన్ని ఉద్దేశించి బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్ రావు మాట్లాడుతూ.. జర్నలిస్టులు పాలకుల చేతిలో మోసపోతున్నారన్నారు. నాయకులు గెలవకముందు ఇచ్చిన మాటలు గుర్తు చేసుకొని.. గెలిచిన తర్వాత వాటిని అమలు చేయాలన్నారు. అన్ని ప్రాంతాలలో జర్నలిస్టులకు ఇండ్లు ఉన్నాయి కానీ కొల్లాపూర్‌లో ఎందుకులేవో మంత్రి గుర్తించాలన్నారు. జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్ల సాధనకు బీజేపీ ఆధ్వర్యంలో ప్రత్యక్ష కార్యాచరణకు పూనుకుంటామన్నారు.

**డిమాండ్లు పట్టించుకోకపోవడం వల్లే రోడ్లపైకి..**

నాగర్ కర్నూల్ జిల్లా సీపీఎం కార్యదర్శి వర్ధం పర్వతాలు మాట్లాడుతూ.. మూడు దశాబ్దాలుగా కొల్లాపూర్ పట్టణ కేంద్రంలోనే ఇండ్ల స్థలాలు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని జర్నలిస్టులు పోరాడుతున్నా.. న్యాయమైన డిమాండ్లు పట్టించుకోకపోవడం వల్లే రోడ్లపైకి వచ్చారన్నారు. పార్టీలకు ప్రజల పక్షాన ప్రజల సమస్యల పట్ల వార్తలు రాస్తూ ప్రజలోకానికి అందిస్తూ చైతన్యం చేస్తున్నారన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు కొల్లాపూర్ పట్టణంలో 72 సర్వే భూమిలో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలన్నారు.

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ శ్రీను మాట్లాడుతూ.. గన్ను కన్నా పెన్ను మిన్న అనే విషయాన్ని పాలకులు అర్థం చేసుకోవాలన్నారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇచ్చేంతవరకు తమ మద్దతు ఉంటుందన్నారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు దేశ్యా నాయక్ మాట్లాడుతూ.. జర్నలిస్టుల పోరాటం న్యాయమైనదన్నారు.

సమాజం కోసం పనిచేసే విలేకరులకు ఎటువంటి ఆధారం లేదని పని చేస్తున్న జర్నలిస్టులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ నాయకులు విలేకరులకు హామీలు ఇస్తూ.. జర్నలిస్టులను నిర్లక్ష్యం చేస్తున్నారని న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్ నాయక్ మాట్లాడుతూ.. న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం జర్నలిస్టులు చేస్తున్న పోరాటానికి తమ మద్దతు ఉంటుందన్నారు.

**కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం..**

బుడగ జంగం హక్కుల సాధన సమితి జాతీయ అధ్యక్షులు నరసింహ మాట్లాడుతూ.. విలేకరులు మూడో నేత్రం లాంటివారని ప్రోటోకాల్ ప్రకారం కుటుంబాలను వదిలి పనిచేస్తున్నారని చీకటిలో వెలుగులు నింపేవారు విలేకరులన్నారు. రాజకీయ నాయకుల ఆదాయం ఎలా పెరుగుతుందో చూస్తున్నాం. జర్నలిస్టుల కుటుంబాలు గడపడం అతికష్టంగా మారిందని గత ప్రభుత్వం విలేకరులకు మొండి చేయి చూపిందని జూపల్లి తలుచుకుంటే జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వచ్చునన్నారు.

కొల్లాపూర్ విలేకరులకు 200 గజాల స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 20 సంవత్సరాలు మంత్రి హోదాలో ఉన్న మంత్రి జూపల్లి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొని వెళ్లి విలేకరులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. విలేకరుల సమస్యలు పరిష్కరించకుంటే కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

గౌండిమల్ల వెల్టూరు వంతెన సాధన కమిటీ నాయకులు కాశన్న, మల్లయ్యలు మాట్లాడుతూ.. సమాజంలోని సమస్యలను ప్రభుత్వానికి తెలియజేసి పరిష్కారం చేసే విలేకరుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోవడం దుర్మార్గం అన్నారు. వెంటనే కొల్లాపూర్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. అంతకుముందు బీజేపీ మండల అధ్యక్షుడు సాయి కృష్ణ గౌడ్ కిసాన్ మోర్చా నాయకుడు శేఖర్ గౌడ్ బీజేపీ మండల అధ్యక్షుడు కేతూరి నారాయణ, బీజేపీ పట్టణ అధ్యక్షుడు కాడం శ్రీనివాసులు మాట్లాడారు.

ఈ దీక్షలలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు రామచంద్రం నియోజకవర్గ కన్వీనర్ జలకం మద్దిలేటి జిల్లా నాయకులు మల్లికార్జున సాగర్, సీనియర్ జర్నలిస్టులు బచ్చలకూర కురుమయ్య, సిపి నాయుడు, రమణ కారంగి, గోవిందు, సురేందర్, మల్లేష్, స్వాములు, పారుశరాముడు, వెంకట రాములు, రాము, శివ పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు కిసాన్ మోర్చా తమటం శేఖర్ గౌడ్, బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు సాయి కృష్ణ గౌడ్, మండల అధ్యక్షుడు నారాయణ పట్టణ అధ్యక్షుడు కాడం శ్రీనివాసులు బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పాకిస్తాన్‌లో తయారైన వస్తువులను రవాణా చేస్తున్న 39 కంటైనర్లను సీజ్ చేసిన డీఆర్ఐ

న్యూఢిల్లీ, జూన్ 27:అక్రమ దిగుమతులను అరికట్టే లక్ష్యంతో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) "ఆపరేషన్ డీప్ మానిఫెస్ట్" పేరుతో విస్తృత తనిఖీలు చేపట్టింది. ప్రధానంగా దుబాయ్, యూఏఈ సహా పలు దేశాల మీదుగా తరలించిన పాకిస్తాన్ వస్తువుల అక్రమ దిగుమతులు లక్ష్యంగా ఈ తనిఖీలు నిర్వహించారు. ఈ ఆపరేషన్ ద్వారా ఇప్పటివరకు సుమారు రూ. 9 కోట్ల విలువైన 1,115 మెట్రిక్ టన్నుల వస్తువులను తరలిస్తున్న 39 కంటైనర్లను సీజ్ చేశారు. దిగుమతి విధాన నిబంధనలను, పాకిస్తాన్‌లో తయారైన వస్తువుల ప్రత్యక్ష..పరోక్ష దిగుమతి, రవాణాలపై ప్రభుత్వం విధించిన నిషేధాన్ని ఈ దిగుమతులు ఉల్లంఘిస్తున్నాయి. దీంతో ఈ వస్తువులను దిగుమతి చేసుకుంటున్న సంస్థ భాగస్వాముల్లో ఒకరిని ఈరోజు అరెస్టు చేశారు.

పహల్గామ్ ఉగ్రవాద దాడుల అనంతరం ప్రభుత్వం.. పాకిస్తాన్‌లో తయారయ్యే , ఆ దేశం ఎగుమతి చేసే వస్తువుల ప్రత్యక్ష, పరోక్ష దిగుమతి, రవాణాలపై సమగ్ర నిషేధం విధించింది. ఈ నిషేధం మే 2 నుంచి అమలులోకి వచ్చింది. గతంలో, అటువంటి వస్తువుల దిగుమతిపై 200 శాతం కస్టమ్స్ సుంకం వసూలు చేసేవారు. అయితే ప్రస్తుతం ఈ వస్తువుల దిగుమతిపై నిషేధం అమలులో ఉన్నప్పటికీ కొందరు దిగుమతిదారులు ఈ వస్తువులు తయారైన దేశాన్ని తప్పుగా చూపిస్తూ.. సంబంధిత షిప్పింగ్ పత్రాలను తారుమారు చేస్తూ వాటిని అక్రమంగా దిగుమతి చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

రెండు వేర్వేరు ఘటనల్లో నవా షెవా ఓడరేవు వద్ద ఈ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ వస్తువులు యూఏఈలో తయారైనట్లు రవాణాదారులు తప్పుడు పత్రాలు చూపారు. అయితే ఇవి నిజానికి పాకిస్తాన్‌లో తయారైనవనీ, భారత్‌లో దిగుమతి కోసం వీటిని దుబాయ్ మీదుగా తరలిస్తున్నారని దర్యాప్తులో తేలింది.

మొదట ఈ వస్తువులను పాకిస్తాన్ నుంచి దుబాయ్‌కి ఒక ఓడలో ఉంచిన కంటైనర్ల ద్వారా తరలించి.. ఆ తర్వాత వేరొక ఓడలోని కంటైనర్లకు బదిలీ చేసి భారత్‌కు తరలిస్తున్నట్లు దర్యాప్తులో గుర్తించారు. ఇప్పటివరకు నిర్వహించిన దర్యాప్తులో పట్టుబడిన వస్తువులను మరింత లోతుగా పరిశీలించి, పత్రాలను విశ్లేషించి.. పాకిస్తాన్‌లోని కరాచీ ఓడరేవు నుంచి ఈ వస్తువులు దుబాయ్‌లోని జాబెల్ అలీ ఓడరేవు మీదుగా భారత ఓడరేవులకు తరలిస్తున్నట్లు కనుగొన్నారు. అంతేగాకుండా పాకిస్తాన్ సంస్థలతో జరిపిన నగదు లావాదేవీలు, ఆర్థిక సంబంధాల వివరాలనూ గుర్తించారు. ఇది అక్రమ ఆర్థిక లావాదేవీల వ్యవహారాన్నీ వెలుగులోకి తెచ్చింది. పాకిస్తాన్, యూఏఈలకు చెందిన పలువురు మోసపూరిత ప్రణాళికలతో పాకిస్తాన్‌లో తయారైన ఈ వస్తువులను వేరే చోట తయారైనవిగా చూపి అక్రమంగా భారత్‌కు తరలించేందుకు ప్రయత్నిస్తున్నారు.

"ఆపరేషన్ సిందూర్" నేపథ్యంలో పెరిగిన భద్రతా చర్యల్లో భాగంగా పాకిస్తాన్ నుంచి వచ్చే సరుకులే లక్ష్యంగా డీఆర్ఐ తనిఖీలు చేపట్టింది. ఇంటెలిజెన్స్ సమాచారం, డేటా విశ్లేషణల ద్వారా నిఘాను మరింత పటిష్టం చేసింది. ఈ చర్యల ఫలితంగా అధిక మొత్తంలో వస్తువులను సీజ్ చేసింది.

ప్రాంతీయ, ప్రపంచ భద్రతకు ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ప్రభుత్వ విధానాలు, కస్టమ్స్..ఇతర సంబంధిత చట్టాల పరిరక్షణ పట్ల డీఆర్ఐ దృఢమైన నిబద్ధతకు ''ఆపరేషన్ డీప్ మానిఫెస్ట్'' నిదర్శనంగా నిలుస్తుంది. జాతీయ–ఆర్థిక భద్రతను కాపాడటం, పాకిస్తాన్‌లో తయారైన వస్తువులను అక్రమంగా దిగుమతి చేసుకోవడం కోసం వాణిజ్య మార్గాల దుర్వినియోగాన్ని నిరోధించడం ఈ ఆపరేషన్ లక్ష్యం. వ్యూహాత్మక నిఘా, లక్ష్యాల అమలు, వివిధ సంస్థలతో సమన్వయం ద్వారా భారత ఆర్థిక సరిహద్దుల భద్రత విషయంలో డీఆర్ఐ కీలక పాత్ర పోషిస్తోంది.

# ఆరోగ్యం, శ్రేయస్సుకు భారత్ అందిస్తున్న సాంస్కృతిక సహకారాన్ని ప్రశంసించిన ప్రధాని

న్యూఢిల్లీ, జూన్ 27:ఆరోగ్యం, శ్రేయస్సుకి సంబంధించి భారత్ అందిస్తున్న గొప్ప సాంస్కృతిక సహకారాన్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈరోజు ప్రముఖంగా ప్రస్తావించారు. పురాతన సంప్రదాయాలను ఆధునిక శాస్త్రీయ పద్ధతులతో మేళవించే వినూత్న అంకుర సంస్థలు పెరుగుతున్న విధానం గురించి తెలియజేశారు.

మన్ కీ బాత్ అప్డేట్స్ 'ఎక్స్' ఖాతాలో చేసిన పోస్టుకు శ్రీ మోదీ స్పందిస్తూ: "దృఢంగా, ఆరోగ్యంగా ఉండేందుకు అవసరమైన అనేక మార్గాలను భారతీయ సంస్కృతి అందిస్తోంది. మన్ కీ బాత్ కార్యక్రమంలో ఇలాంటి ప్రయత్నాలను మేం వివరిస్తున్నాం. అంకుర సంస్థల్లో, ఆధునికతను అద్భుతంగా మేళవించే విధానం వాటిలో ఒకటి."

# ఎవరూ ఆదివాసీల జోలికి వెళ్లడం లేదు

## –మావోయిస్టుల లేఖపై మంత్రి సీతక్క వివరణ

ములుగు, జూన్ 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఆదివాసీల వ్యవహారంలో మావోయిస్టులు తనకు సంధించిన లేఖపై తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క స్పందించారు. తన మూలాలను తానెప్పుడు మరిచి పోలేదన్నారు. శుక్రవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ములుగులో మంత్రి సీతక్క విలేకర్లతో మాట్లాడుతూ.. జీవో 49ను తాను వ్యతిరేకించానని గుర్తు చేశారు. మంత్రిగా ఉండి తమ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యేలతో సమావేశం పెట్టానని వివరించారు. ఆ క్రమంలో ఆదివాసీల జోలికి వెళ్లవద్దని అటవీశాఖ అధికారులకు మంత్రి కొండా సురేఖతోపాటు తానూ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. కొందరు రాజకీయ నాయకుల ప్రోద్బలంతో ఒకరిద్దరు అటవీశాఖ అధికారులు తప్పా.. ఎవరూ ఆదివాసీల జోలికి వెళ్లడం లేదని మంత్రి సీతక్క వివరణ ఇచ్చారు. అయితే ఎవరు మాట్లాడినా నిజాలు మాట్లాడాలంటూ మావోయిస్టులకు ఆమె పరోక్షంగా సూచించారు. ఆదివాసీల వ్యవహారంపై ఇవాళ(శుక్రవారం) ఉదయం మంత్రి సీతక్కకు మావోయిస్టులు లేఖ రాశారు. ఈ లేఖలో వారు ఏమన్నారంటే.. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో కీలక మంత్రిగా పని చేస్తున్న మాజీ మావోయిస్టు సీతక్క.. ఆదివాసీల హక్కుల గురించి కనీసం పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో ఆదివాసీల హక్కులకు పూర్తి బాధ్యత మంత్రి సీతక్కదేనని స్పష్టం చేశారు. జీవో నెంబర్ 49తో కుమురం భీమ్ జిల్లాలోని 339 ఆదివాసీ గ్రామాలను ఖాళీ చేయించాలని ప్రభుత్వం చూస్తోందని మండిపడ్డారు. ఈ జీవో 49 కారణంగా రాష్ట్రంలో మూడు జిల్లాలు కనుమరుగవుతున్నాయంటూ ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టేందుకే జీవో నెం. 49 తీసుకువచ్చారంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఈ జీవోను వెంటనే రద్దు చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాగా, ఈ లేఖపై మంత్రి సీతక్క వెంటనే స్పందించి వివరణ ఇచ్చారు.

# ఫోన్ ట్యాపింగ్‌లో గాడిద గుడ్డు తప్ప చర్యలు ఉండవు..

## – కాంగ్రెస్, బీఆర్ఎస్ మూలాఖత్ అయ్యాయి : బీజేపీ ఎంపీ రఘునందన్ రావు

హైదరాబాద్, జూన్ 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: దుబ్బాక ఉప ఎన్నికలతోనే ఫోన్ ట్యాపింగ్ ప్రారంభమైందని.. మొట్ట మొదటిసారిగా తన ఫోన్ ట్యాపింగ్ అయ్యిందని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు తెలిపారు. దుబ్బాక ఉప ఎన్నికల్లో ఫోన్ ట్యాపింగ్ జరిగిందని డీజీపీకి అనేక సార్లు ఫిర్యాదు చేశానని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్‌తో సంబంధంలేని కాంగ్రెస్ నాయకులను సిట్ పిలుస్తోందని.. దుబ్బాక ఉప ఎన్నికల్లో ఫోన్ ట్యాపింగ్ అయ్యింది తనదన్నారు. మమ్మల్ని అడిగితే అన్ని వివరాలు ఇచ్చే వాళ్ళమన్నారు. ఫోన్ ట్యాపింగ్‌లో గాడిద గుడ్డు తప్ప చర్యలు ఉండవని.. కాంగ్రెస్, బీఆర్ఎస్ మూలాఖత్ అయ్యాయని విమర్శించారు. ఫిర్యాదు చేసిన తమను సిట్ ఎందుకు పిలవడం లేదని ప్రశ్నించారు. రోజుకు ఒక్కరిని మాత్రమే విచారణ చేయడానికి ఇదేమైనా డైలీ సీరియలా అని ప్రశ్నించారు. ఆధారాలు ఇచ్చే వాళ్లను పక్కన పెట్టి డైలీ సీరియల్ నడుపుతున్నారని విమర్శలు గుప్పించారు.

# ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో పెట్టాలి

## –సోషలిస్ట్ కూటమి జాతీయ కార్యదర్శి,, యల్, జైబాబు డిమాండ్




హైదరాబాద్, జూన్ 27:ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో పెట్టాలని సోషలిస్ట్ కూటమి జాతీయ కార్యదర్శి యల్, జైబాబు డిమాండ్ చేసారు. బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో జరిగిన తెలంగాణ కూటమి రాష్ట్ర కమిటీ సమావేశంలో జైబాబు మాట్లాడుతూ జులై 21నుండి జరుగు వర్షాకాలసమావేశాల్లో బిల్లు తక్షణమే పెట్టాలని, అనేక దశాబ్దాలుగా వివిధ పార్టీల ఎంపి లు ప్రై వేట్ రిజర్వేషన్ బిల్లు పై పట్టు పట్టినా తిరస్కరణకు గురైందన్నారు బిఇ, బిబి, నీఎఇ, వఎఇ, లు ఎన్నో సంవత్సరాలనుండి సామాజిక, ఆర్థిక రంగాల్లో అవకాశల్లో సమాన ప్రాధాన్యం కోసం న్యాయం కోసం పార్లమెంట్ లోపల బైటా పౌర సమాజపక్షంగా పెద్దఎత్తున ఉద్యమం సోషలిస్ట్ పార్టీలు, కమ్యూనిస్ట్ లు ప్రజాసంఘాలనేతలు దేశవ్యాప్తంగా పోరాడుతున్న సంగతి దేశ ప్రధాని మోడీ ద్రుష్టి కి మరోసారి తెస్తూ తీబబ, ఎతీజూ, కాంగ్రెస్, తో సహా ప్రాంతీయ పార్టీలు ఈ న్యాయమైన డిమాండకోసం, కొన్ని రాష్ట్రాలు జర్ఖండ్,, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, పంజాబ్, హర్యానా, కర్ణాటక 371ఆర్టికల్ తో ఉన్న అవకాశలతో చట్టాలు చేసిన సంగతి ప్రధాని గుర్తించాలన్నారు, హర్యానారాష్ట్రం ప్రై వేట్ రిజర్వేషన్ కల్పన చట్టం పై హైకోర్టు నిలుపుదలచేసిన దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల యువత స్థానిక కోట భూమి పుత్రులుగా మూడింటా రెండు వంతులమంది కేంద్ర ప్రభుత్వమే ప్రైవేట్ రంగాన్ని బ్యాలెన్స్ చేసి చట్టం తీసుకు రావాలని స్వేచ్ఛ సమానత్వాలకు, రాజ్యాంగ ఉల్లంఘనలు లేకుండా చట్టం చేయాలని సోషలిస్ట్ కూటమి డిమాండ్ చేస్తుందన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే ప్రై వేట్ రంగమే కీలకమన్నారు, చైనాను మించి భారత్ జనాభా పెరుగుతున్నా 94%ప్రజలు అనార్గ నైజడ్ సెక్టర్ లో పనిచేస్తున్నారని ఇక్కడ కార్మికులు శ్రమ దోపిడీకి, యాజమాన్య దోపిడీకి గురై తీరని అన్యాయం జరుగుతుందని ప్రైవేట్ సంస్థలను అందులో కార్మికులను గుర్తించే చర్యపై ముందుగా పార్లమెంట్ లో చర్చ పెట్టాలని కోరారు. ప్రభుత్వం వద్ద ప్రభుత్వ, ప్రైవేట్ లో కార్మికులు 10,720,000కోట్లలో ఉన్నా చట్టం వస్తే 18కోట్ల మంది దేశ 'యువత ఒక్కసారిగా లబ్ది పొందుతారని అందులో మొతంగా పెద్దఎతున్న బిఇ బిబి, నీనీఎఇ, వఎఇ లే లబ్ది చేకూరుతుంది అన్నారు, అధిక శ్రమ ఉత్పత్తి ఉన్నా కార్మికులకు సరైన వేతనాలు పిఎఫ్ గ్రాడ్యూటీ నూతన పెన్షన్ అందటం లేదన్నారు తెలంగాణ భూమి పుత్రులకు స్థానిక చదువు కున్న యువతకు విద్యా, ఉపాధి, ఆర్థిక రంగాల్లో సామాజిక న్యాయం జరగాలంటే పార్లమెంట్ నుండి రావాల్సిన చట్టం పై అన్ని పార్టీల ఎంపి లకు సిఎం రేవంత్ రెడ్డి దిశ దశ నిర్దేశం చేసి వర్షాకాలపార్లమెంట్ సమావేశాల్లో దగ్గరుండి ఎంపిలతో పట్టు పట్టి చర్చకు తెరలేపాలని ప్రైవేట్ రిజర్వేషన్ చట్టమ్ తెచ్చి తెలంగాణ ఆస్థిత్వాన్ని కాపడాలన్నారు,చట్ట బద్దత ఉన్న అన్నిరంగాలకు రిజవేషన్ వర్తించే చర్యలు రావాలి, డిలిమిటేషన్ కు నీఎఇ, వఎఇ,, జనాభాలెక్కలు తెల్చాలి రిజర్వేషన్ల పై పరిమితి ఎత్తి వేసి బిఇ, బిబి, నీఎఇ, వఎఇ లకు రిజవషన్లు పెనీచాలని, మహిళా రిజర్వేషన్ బిల్లు అమలుకు తెలంగాణ పౌర సమాజ పక్షంగా సోషలస్ట్ కూటమి పోరులో బాగమవ్వాలని జైబాబు ఇలుపునిచ్చారు. ఈ సమావేశం లో డా..సింగం శ్రీనివాస్. తెలంగాణ ఇంచార్జ్,డి.రాణి.తెలంగాణ మహిళా, కార్యదర్శి, ఎన్. రాజు.ట్రేడ్ యూనియనిస్ట్ తె లంగాణ రాష్ట్ర కార్యదర్శ , జాతీయ అద్వయిజర్ దేవసేన, ఎంసిపిఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎం.చంద్ర శేకర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం అమాయకులను చంపుతోంది

## –ఓ బీసీ ఉద్యమకారుడిని ఎన్‌కౌంటర్ చేయడం బాధాకరం

## –ఆపరేషన్ కగార్‌ని నిలిపివేయాలి ..మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి

వరంగల్ జూన్ 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం అమాయకులను చంపుతోందని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి ఆరోపించారు. ఆపరేషన్ కగార్‌ని నిలిపివేయాలని కోరారు. ఓ బీసీ ఉద్యమకారుడిని ఎన్‌కౌంటర్ చేయడం బాధాకరమని అన్నారు. ఆపరేషన్ కగార్‌ని నిలిపివేయాలని ఆందోళనలు చేస్తామంటే పోలీసులు అడ్డుకున్నారని గుర్తు చేశారు. ఇవాళ(గురువారం) వరంగల్ జిల్లాలోని పోచమ్మ మైదాన్ జంక్షన్‌లో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి, కాంగ్రెస్ శ్రేణులు భారీగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేశారు. అనంతరం కొండా మురళి మీడియాతో మాట్లాడారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుపై సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను ఉన్నంత వరకు కార్యకర్తలను కాపాడుకుంటానని హామీ ఇచ్చారు. బీసీ నాయకుడిని అయినందుకే తనపై కక్షగట్టి అసత్య ప్రచారాలు చేస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పరకాల నియోజకవర్గంలో త్వరలోనే కొండా సుస్మిత పటేల్ రంగ ప్రవేశం చేస్తారని తెలిపారు. కొండా సురేఖ మంత్రి పదవి పోతుందని కొంతమంది ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కొండా సురేఖ మంత్రి పదవి ఎక్కడికి పోదని స్పష్టం చేశారు. తమ వెంట సీఎం రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ ఉన్నారని కొండా మురళి పేర్కొన్నారు.

# కేఎంసీ పరిధిలోని హాస్పిటల్స్‌ని తనిఖీ చేసిన సర్వే సంగీత

వరంగల్, జూన్ 27: కాకతీయ మెడికల్ కళాశాల పరిధిలోని పలు హాస్పిటల్స్‌ను రాష్ట్ర ఆరోగ్య శాఖ కమిషనర్ సర్వే సంగీత తనిఖీలు చేశారు. జాతీయ వైద్య మండలి ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తనిఖీలలో భాగంగా నేడు ఆమె కేఎంసీ పరిధిలోని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఎంజీఎం, సీకేఎం ప్రభుత్వ ప్రసూతి హాస్పిటల్లను తనిఖీ చేశారు. ఉదయం కేఎంసీలో విభాగాధిపతులు వైద్యాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కళాశాలలో వైద్య విద్యార్థుల సంఖ్య విభాగాల వారీగా సేకరించడంతోపాటుగా కేఎంసీ పరిధిలోని హాస్పిటల్స్ లో అందుబాటులో ఉన్న యంత్ర పరికరాలు, ల్యాబ్ లు, నిత్యం సేవలు పొందుతున్న ఓపీ వివరాలను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లో మౌలిక వసతులను పరిశీలించి, విభాగాల వారీగా వైద్య సేవల తీరును రోగులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఎంజీఎం లో ఓపీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ తీరును పరిశీలించారు. ఫార్మసీలో అందిస్తున్న మందులు, పోర్టల్ నమోదు పై వివరాలు అడిగి తెలుసుకొని సంతృప్తికర సమాధానం ఇవ్వని నూవర్ వైజర్ పై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సత్య శారదను ఆదేశించారు. డైట్ నిర్వహణను పరిశీలించిన కమిషనర్ డైట్ లో సైతం బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేయాలని సూచించారు. అనంతరం పీడియాట్రిక్స్ వార్డును పరిశీలించి చిన్నారులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు.

తదనంతరం సీకేఎం హాస్పిటల్ సందర్శించిన కమిషనర్ లేబర్ రూమ్, ఆపరేషన్ థియేటర్లను పరిశీలించి, నిత్యం వైద్య సేవలు పొందుతున్న మహిళల వివరాలను, రికార్డు నమోదు, అందుబాటులోవున్న పరికరాలు, డైట్ నిర్వహణ , వైద్య విద్యార్థులకు ప్రత్యేకంగా చేసిన ఏర్పాట్లను, మందుల పంపిణీ, 102 వాహనాల నిర్వహణ, పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీల్లో జిల్లా కలెక్టర్ సత్య శారద, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. సాంబశివరావు, పలువురు విభాగాధిపతులు, వైద్యులు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆషాఢ మాసం సందర్భంగా శ్రీ దుర్గాదేవి దేవాలయంలో ప్రత్యేక పూజలు

హైదరాబాద్, జూన్ 27: ఆషాఢ మాసంను పురస్కరించుకొని మన్సురాబాద్ శ్రీ సాయి నగర్ కాలనీలోని శ్రీ దుర్గాదేవి దేవాలయంలో అమ్మవారిని నింబశాఖ మాలలతో (వేప ఆకు మాలలతో) అలంకరించి ప్రత్యేక పూజలను నిర్వహించారు.

ఆషాఢమాసం సందర్భంగా నెల రోజులపాటు ఆలయంలో ప్రతి శుక్రవారం అమ్మవారిని వివిధ రూపాలలో అలంకరించి పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పోచబోయిన గణేష్ యాదవ్ తెలిపారు.

జూలై 4న అమ్మవారిని శాకాంబరి దేవి రూపంలో, 11వ తేదీన జంజర ఫల మూలరూపంలో, 18వ తేదీన పుష్పాలంకరణ నిర్వహించబడుతుందని తెలిపారు. అదేవిధంగా జులై 6న తొలి ఏకాదశి సందర్భంగా విష్ణుమూర్తికి పంచామృత, ఫల రసాభిషేకాలు నిర్వహించబడతాయని తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై ఆషాఢమాస పూజల్లో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు యాదగిరి, హనుమంతరావు, రమేష్, రవి, మురళి, అశోక్, రమణమూర్తి, అజయ్, లక్ష్మయ్య, కేశవులు, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ అంధుల పాఠశాలకు అండగా ఉంటాం

## – శాతవాహన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్



హైదరాబాద్, జూన్ 27: శాతవాహన విశ్వవిద్యాలయ ప్రధాన గేటుకు ఎదురుగా ఉన్న ప్రభుత్వ అంధుల పాఠశాలకు అండగా ఉంటూ అన్ని విధాల ఆదుకుంటామని, దృష్టితో కలిగిన విద్యార్థుల ఇష్టంగా కష్టపడుతూ ఉన్నతికి రావాలని శాతవాహన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్ అన్నారు. ఈ రోజు లీడ్ ఇండియా నేషనల్ క్లబ్ సౌజన్యంతో "దివ్యాంగురాలు హెలెన్ కెల్లర్ పుట్టిన రోజు" సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాట్లాడుతూ అంధుల మెదడు చురుకుగా పని చేస్తుందని, వారు ఏకాగ్రతతో చదివితే ఉజ్వల భవిష్యత్ సాధ్యమ వుతుందని అన్నారు. కరీంనగర్ ప్రభుత్వ అంధుల పాఠశాలను శాతవాహన యూనివర్సిటీ దత్తత తీసుకొని తమ అధ్యాపకులతో వారానికి ఒకటి లేదా రెండు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామని అంటూనే తన వ్యక్తిగతంగా 10,000/- విరాళాన్ని అందజేశారు. అదే విధంగా యూనివర్సిటీ సిబ్బంది శ్రీకాంత్, సంతోష్, మారుతీలు తమ వంతుగా రూ 2,000/- అందజేశారు. సభాధ్యక్షత వహించిన లీడ్ ఇండియా అధ్యక్షులు కెప్టెన్ డా బుర్ర మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యం ప్రతివాదులకు జాబితాలో ముందు నిలిచిన చెవిటి-అంకురాలు హెలెన్ కెల్లర్ మనందరికీ, ముఖ్యంగా దివ్యాంగులకు దారి దీపంగా నిలుస్తున్నారని తెలిపారు. ప్రపంచంలోనే తొలి యూనివర్సిటీ డిగ్రీ పొందిన చెవిటి-అంధ మహిళగా రికార్డు నెలకొల్పి దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు పోరాడిన అద్వితీయ మహిళగా పేరు తెచ్చుకున్నారు. సంస్థ కార్యదర్శి హెలెన్ కెల్లర్ చేసిన సేవలను కొనియాడారు. పాఠశాల హెచ్ఎం భాస్కర్ మాట్లాడి విద్యాలయ ప్రగతిని వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బ్రెయిలీ లిపి, పాటలు పాడడం, వ్రకృత్వం, సంగీత పోటీల్లో ప్రథమ, ద్వితీయ విజేతలకు ముఖ్య అతిథి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా అంధ విద్యార్థులు పాడిన పాటలకు స్పందించిన వీసీ ఆచార్య ఉమేష్ కుమార్, కెప్టెన్ డా బుర్ర మధుసూదన్ రెడ్డిలు కూడా వీర జవాన్ల త్యాగాలను కొనియాడుతూ పాటలను పాడారు. ఎం మహేందర్ రెడ్డి వందన సమర్పణ చేసిన కార్యక్రమంలో పి సురేందర్, ఉపాధ్యాయులు రమేష్, శ్రీనివాస్ రెడ్డి, సరళ, పాఠశాల బోధన భోజనంతో సిబ్బందితో పాటు 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమ అనంతరం లీడ్ ఇండియా పక్షాన విద్యార్థులకు స్వీట్స్ పంపిణీ చేశారు.

# జానపద పౌరాణిక చారిత్రక మిళితం సిరికాకొలను చిన్నది నృత్య రూపకం



హైదరాబాద్, జూన్ 27: కృష్ణా జిల్లా లోని శ్రీకాకుళం ఆంధ్ర శ్రీ మహా విష్ణువు దేవాలయం నెలవైన గ్రామం ఆ దేవాలయాన్ని శ్రీ కృష్ణ దేవరాయలు దర్శించి తరువాతనే ఆయన ఆముక్త మాల్యద కావ్య రచన ఆరంభించారు అన్నది ప్రతీతి కాగా అదే కాలం లో అలువేణి అనే దేవ దాసి చుట్టూ అల్లుకున్న కథ సిరికాకోలను చిన్నది. దేవదాసీ వ్యవస్థ లో పుట్టిన అలువేణి తల్లి అభీష్టానికి వ్యతిరేకం గా శ్రీ కాకులాంధ్ర మహా విష్ణువు నే భర్త గా భావించి ఆ దేవాలయం లో సేవలు చేస్తూ వుంటుంది కృష్ణ దేవరాయలు ఆ ప్రాంతం కు మార్తాండ శర్మ ను మండలదీశుడు గా నియమిస్తారు అలువేణి పై శర్మ వ్యామోహం పెంచుకుని మహావిష్ణు గా ఆభరణాలు ధరించి ఆమెను నమ్మించి జీవనం సాగిస్తాడు చివరకు కృష్ణ దేవరాయలు సభలో అలువేణి గర్భవతి గా బయట పడటం ఇందుకు కారణం ఇన శర్మ ను అలువేణి తల్లి ఆమె మిత్రులను శిక్షించడం తో కథ ముగుస్తుంది జానపదం పౌరాణికం చరిత్ర మిళితమైన సిరికాకోలను చిన్నది విఖ్యాత గీత. రచయిత వేటూరు సుందర రామ మూర్తి రాయగా భార్గవి పరమేశ్వరన్ సహకారం తో ప్రముఖ నాట్య గురువు స్మిత మాధవ్ నృత్య దర్శకత్వం చేయగా రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై రాగ సప్త స్వరం,పర్ణ ఆర్ట్స్ అకాడమీ నిర్వహణలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యం తో ప్రదర్శించారు పదునెనిమిది దృశ్యాలు గా సుదీర్ఘం గా సాగిన నృత్య రూపకం మహా మహులైన సంగీతజ్ఞులుసంగీత రూపకల్పన చేయడం వేటూరి సాహిత్యం ఆసాంతం ప్రేక్షకులను ఆకట్టుకునేలా చేశాయి స్మిత మాధవ్ ప్రధాన పాత్రలో రాణించగా నలభై మంది కళా కారులు రూపకం రక్తి కట్టించారు అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో మా లక్ష్మి గ్రూపు హరీష్ యార్లగడ్డ విద్యా వేత్త ప్రీతి రెడ్డి సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ సినీ రచయిత భారవి డాక్టర్ సతీష్ రెడ్డి వేటూరి సతీమణి రాజ్య లక్ష్మి తమ అభినందన తెలిపుతూ దృశ్య కావ్యం గా ప్రదర్శన వుందని అన్నారు రాగ సప్త స్వరం రాజ్య లక్ష్మి స్వాగతం పలుకుతూ వేటూరి రచన ను తమ సంస్థ నిర్వహణ లో ప్రదర్శించడం ఆనందం గా ఉందన్నారు

# ముఖ్యమంత్రి సహాయ నిధి,కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణి చేసిన ప్రభుత్వ విప్



రాజన్న సిరిసిల్ల, జూన్ 27:(నేటి నిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో వేములవాడ అర్బన్, పట్టణ పరిదిలో అర్హులైన 76 మంది లబ్ధదారులకు కళ్యాణ లక్ష్మి ఢ షాది ముబారాక్ ,18 లక్షల 80 వేల విలువ గల 54 ముఖ్యమంత్రి సహాయ నిది చెక్కులను శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, పిల్లి కనకయ్య, పుల్కం రాజు, నాగుల విష్ణు, ముప్పిడి శ్రీనివాస్, శ్రీధర్, పాల్గొన్నారు.

# మాట తప్పడం రేవంత్ రెడ్డికి అలవాటుగా మారింది.. ఆటో కార్మికుల సమస్యలపై ఎమ్మెల్యే హరీష్ రావు

హైదరాబాద్, జూన్ 27: ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించేందుకు బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని మాజీ మంత్రి హరీష్‌రావు తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ క్యాంప్ కార్యాలయంలో పటాన్‌చెరువు ఆటో డ్రైవర్ల సంఘం ప్రతినిధులు కలిసి సమస్యలు వివరించారు.

రాష్ట్ర మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆటో కార్మికుల జీవితం దయనీయంగా మారింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించి మమ్మల్ని మోసం చేశారు..అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను బీఆర్ఎస్ ముందుండి పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 18 నెలల వ్యవధిలో 142 మంది ఆటో కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఇవి ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ హత్యలేనన్నారు హరీష్‌రావు. ఎన్నికల ముందు ఏడాదికి రూ.12,000 భృతి ఇస్తామన్న హామీ ఇచ్చి మోసం చేశారు. కానీ ఇప్పుడు ఆటో కార్మికుల గురించి ఒక్క మాటా మాట్లాడడం లేదు. ఆటోలు నడవక, బ్యాంకుల కిస్తీలు చెల్లించలేక ఆర్థికంగా కుదేల వుతున్నారు. అయినా ప్రభుత్వానికి చీమ కుట్టినట్టయినా లేదు.ఆటో కార్మికుల కుటుంబాల పోషణ భారంగా మారి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక మాట తప్పడం రేవంత్ రెడ్డికి అలవాటుగా మారింది. అసెంబ్లీ వేదికగా కూడా ఆటో కార్మికుల పక్షాన ప్రశ్నించింది బీఆర్ఎస్. కార్మికుల సంక్షేమం కోసం బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుంది. ఆటో కార్మికులకు కేసీఆర్ అండగా ఉంటారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల హామీలను అమలు చేసి, ఆటో కార్మికులకు భద్రత కల్పించాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం.

# భక్తులకు గుడ్ న్యూస్.. కాశీనాయన జ్యోతి క్షేత్రానికి ఆర్టీసీ రెడీ!

అమరావతి, జూన్ 27:కడప జిల్లా ప్రజలకు, ముఖ్యంగా కాశీనాయన జ్యోతి క్షేత్ర భక్తులకు గుడ్ న్యూస్. కొంతకాలంగా నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు సర్వీసులను తిరిగి ప్రారంభించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కాశీనాయన జ్యోతికి క్షేత్రానికి ఆర్టీసీ బస్సు సర్వీసులను తిరిగి ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నట్లు మంత్రి నారా లోకేష్ ప్రకటించారు.

ఈ విషయంపై సంబంధిత శాఖల మంత్రులు, అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి లోకేష్, అటవీ శాఖ, ఆర్టీసీ శాఖ సమన్వయంతో భక్తుల ప్రయాణ సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని బస్సు సర్వీసులను తిరిగి ప్రారంభించాలని స్పష్టమైన సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా.. గతంలో కాశీనాయన జ్యోతి క్షేత్రంలో ఉన్న అన్నదాన సత్రాలను కూడా భక్తుల కోసం తిరిగి తెరుస్తామని మంత్రి లోకేష్ తెలిపారు.

"ప్రజా ప్రయాణ సౌకర్యాల విషయంలో ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోంది. భక్తుల శ్రద్ధకు తగిన విధంగా సేవలు అందించేందుకు కట్టుబడి ఉన్నాం," అని మంత్రి లోకేష్ తెలిపారు. ఈ చర్యపై భక్తుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

# రూ.5 అన్నపూర్ణ భోజన కేంద్రాలకు ఇందిర క్యాంటీన్లుగా పేరు మార్పు

## -అలాగే భోజన కేంద్రాల్లో భోజనంతో పాటు అల్పాహారం

## -స్టాండింగ్ కమిటీలో ఆమోదం

హైదరాబాద్ జూన్ 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );గ్రేటర్‌లోని రూ.5 అన్నపూర్ణ భోజన కేంద్రాలకు ఇందిర క్యాంటీన్లుగా పేరు పెట్టాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. అలాగే కేంద్రాల్లో భోజనంతో పాటు అల్పాహారం అందించాలని భావిస్తున్నారు. ఈ మేరకు గురువారం మేయర్ విజయలక్ష్మి అధ్యక్షతన సంస్థ ప్రధాన కార్యాలయంలో జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో తీర్మానం చేశారు.ఎజెండాలోని 22 అంశాలతోపాటు టేబుల్ ఐటమ్స్‌గా 10 ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు.11 ప్రాంతాల్లో సీటింగ్ సదుపాయం పునరుద్ధరించడంతో పాటు, మరో 40చోట్ల పౌరులు కూర్చుని తినేలా సౌకర్యాలు కల్పించనున్నారు. సమావేశంలో కమిషనర్ ఆర్వీ కర్ణన్, సభ్యులు పాల్గొన్నారు.

ముఖ్యమైన అంశాలు

- జీహెచ్ఎంసీలోని నాలాలు, వరద నీటి కాలువల గుర్తింపునకు సాంకేతిక సర్వే చేపట్టాలి.
- రెండు పడకల ఇళ్ల సముదాయాల్లో సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల (ఎస్టీపీ) నిర్మాణం, నిర్వహణ బాధ్యతల నుంచి ఎంపికైన సంస్థ తప్పుకోవడంతో అంసపూర్తిగా ఉన్న పనులను జై శ్రీరామ్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ సంస్థకు టెండర్లు పిలవకుండా అప్పగించాలి.
- మల్కాజ్‌గిరి సర్కిల్‌లో ఏర్పాటుచేసే నూతన రైల్వే స్టేషన్‌కు రాధాకృష్ణానగర్ స్టేషన్‌గా పేరు పెట్టినందున.. ఇంగ్లీష్, హిందీ, స్థానిక భాషలలో అక్షరాల ధ్రువీకరణకు ప్రభుత్వానికి పంపాలి.
- గచ్చిబౌలిలోని శిల్ప లే అవుట్ సెకండ్ లెవల్ వంతెనకు దివంగత పి.జనార్దన్‌రెడ్డి పేరు పెట్టాలి.
- 156 మంది అవుట్ సోర్సింగ్ సిబ్బందిని హైడ్రా నుంచి జీహెచ్ఎంసీకి తిరిగి తీసుకొని వారిని పార్కుల వద్ద సెక్యూరిటీ గార్డులుగా నియమించాలి. వీరి సేవలు ఏడాది పొడిగిస్తూ నిర్ణయం.



# ఉద్యమకారుల దీక్షలకు సంఘీభావం తెలుపుదాం

## -రాష్ట్ర కన్వీనర్ యెల్ల పోశెట్టి



రాజన్న సిరిసిల్ల, జూన్ 27:(నేటి నిజం ప్రతినిధి): ఉద్యమకారుల దీక్షలకు సంఘీభావం తెలపాలని తెలంగాణ ఉద్యమకళా కారుల విభాగం రాష్ట్ర కన్వీనర్ యెల్ల పోశెట్టి అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ఉద్యమక ళాకారుల ప్రధాన కార్యాలయంలో సమావేశం నిర్వహిం చారు.

ఈ సందర్భంగా కళాతపస్వి యెల్ల పోశెట్టి మాట్లా డుతూ జూన్ 30 సోమవారం రోజున ఉదయం 10 గంటలనుండి సాయం త్రం 5: గంటల వరకు టఫ్ (టియు ఎఫ్) రాష్ట్ర కమిటీ పిలుపువేం ˇకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమకారుల శాంతియుత దీక్షలకు 33 జిల్లాలోని కళాఉద్యమకారుల అధ్యక్షులు కన్వీనర్లు కోఆర్డినేటర్లు, మండల అధ్యక్షులు కన్వీనర్లు, కోఆర్డినేటర్లు, మహిళా కళాకారుణీలు, అధ్యక్షురాల్లు, కన్వీనర్లు కమిటీ సభ్యులు జిల్లాలలోని, నియోజక వర్గంలోని మండల కేంద్రం లోని గ్రామ స్థాయిలోని ఉద్యమకారుల శాంతియుత దీక్షల శిబిరాల వద్దకు చేటరుకొని, రాష్ట్ర ప్రభుత్వం తెలం గాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీ లను వెంటనే అమలు చేయాల ని తెలియజేస్తూ ఉద్యమ కళాకా రు లందరూ సంఘీభావం ప్రకటిం చా లని కోరారు.

ఈ సమావేశంలో ఉత్తర తెలంగాణ కోఆర్డినేటర్ బొడ్డు రాములు, రాజన్న సిరిసిల్ల జిల్లా ఉపాఅధ్యక్షులు కనపర్తి హనుమాన్లు, బుర్రి శంకరయ్య, వీర్నపల్లి మండల అధ్యక్షులు నేరెళ్ల ముత్యం గౌడ్, చందుర్తి మండల అధ్యక్షులు దొంగరి లక్ష్మిరాజం, ఉపాధ్యక్షులు పుల్కం లచ్చయ్య, భూత అంజయ్య, చిదుర నాగరాజు, వివిధ మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

# బొల్లారంలో నూతనంగా నిర్మించిన పాఠశాల, కళాశాల భవనాలు ప్రారంభం

హైదరాబాద్, జూన్ 27: కంటోన్మెంట్, బొల్లారంలోని ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాల నూతన భవనాలను గ్లాండ్ ఫార్మా సంస్థ సహకారంతో సిఎస్ఆర్ నిధులతో నిర్మించిన ప్రభుత్వ పాఠశాల, కళాశాల భవనాలను శుక్రవారం గ్లాండ్ ఫార్మా మేనేజింగ్ ట్రస్టీ రఘు రామన్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ లక్ష్మి, ఎమ్మెల్యే శ్రీ గణేష్ కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. సిఎస్ఆర్ నిధుల కింద ల్యాండ్ ఫార్మా సంస్థ చేసిన సహకారం గొప్పదని కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు రాజకీయాలలో, వివిధ రంగాలలో ఉన్నత స్థాయిలో ఉన్నారని తెలిపారు. మట్టిలో మాణిక్యాల లాంటి విద్యార్థులు ప్రభుత్వ పాఠశాల కళాశాలలోనే తయారవుతారని, కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన జరుగుతున్నట్లు, విద్యార్థులు కూడా ప్రయోజకులు అవుతున్నారని వెల్లడించారు.

అనంతరం సంస్థ ట్రస్టీ రఘు రామన్ మాట్లాడుతూ.. నూతన పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు అన్ని రకాల వసతులు, అధునాతన సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు వారికి వచ్చే అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం పదవ తరగతి, ఇంటర్ ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం చేసి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ లక్ష్మి, డీఈఓ కిషన్, ఇంటర్మీడియట్ బోర్డు ఎడ్యుకేషన్ డిప్యూటీ సెక్రెటరీ యాదగిరి, ఉపాధ్యాయులు ఫ్రెడ్రిక్, సంస్థ ప్రతినిధులు, సీనియర్ నాయకులు వేణుగోపాల్ రెడ్డి, జయ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# హోం గార్డ్స్ సిబ్బంది సంక్షేమానికి ప్రత్యేక చర్యలు

## -జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే



రాజన్న సిరిసిల్ల, జూన్ 27:(నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లాలో పని చేస్తున్న హోం గార్డులకు వారి సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని డిజిపి కార్యాలయం నుండి వచ్చిన ఉలెన్ జాకెట్స్ అండ్ రెయిన్ కోట్స్ ను జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే శుక్రవారం అందజేశారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న హోమ్ గార్డ్స్ పోలీసు శాఖలో అంతర్గత భాగమని,పోలీసులతో పాటే నిరంతరం తమ సేవలను అందిస్తున్నారని,ప్రతి పోలీస్ స్టేషన్లో పోలీసు సిబ్బందితో బాటు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. క్లిష్ట పరిస్థితులలో కూడా వివిధ బందోబస్తు విధుల్లో చాలా సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారన్నారు.హోమ్ గార్డ్స్ అధికారులు,సిబ్బంది ఎవరికైన సమస్యలు ఉంటే నేరుగా తనని సంప్రదించవచ్చని,రాష్ట్ర పోలీస్ శాఖ సిబ్బంది కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. నిరంతరం ఎండనకా,వాననకా రాత్రింబవళ్ళు కష్టపడి పని చేసే సిబ్బందికి అత్యవసర సమయాలలో ఉలెన్ జాకెట్స్ అండ్ రెయిన్ కోట్స్ ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. విధి నిర్వహణ సమయంలో అప్రమత్తంగా ఉండాలని, క్రమశిక్షణ కలిగిన పోలీస్ శాఖలో పనిచేస్తూ నిబంధనలు ఉల్లగింస్తే భవిష్యత్తులో శాఖ పరమైన ఇబ్బందులు ఎదురవుతాయని వివరించారు.

ఈ కార్యక్రమంలో ఆర్ఐలు యాదగిరి, మధుకర్, హోమ్ హార్డ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసిన పరికపల్లి



ఖమ్మం, జూన్ 27 (నేటినిజం ప్రతినిధి) : కొనిజర్ల మండలం పెద్దమునగాల గ్రామానికి చెందిన తెల్లూరి వెంకటేశ్వర్లకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన 29వేల రూపాయల చెక్కుని, రొంటే వెంకట నరసమ్మకి 58వేల రూపాయల చెక్కుని అందజేసిన జిల్లా కాంగ్రెస్ నాయకులు పరికపల్లి శ్రీనివాస్ గౌడ్ ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ...ఏమ్మెల్యే రాందాస్ నాయకత్వంలో నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని గ్రామాల్లో సీసీ రోడ్లు, అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం వంటి పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతని రాబోయే రోజుల్లో అన్ని పథకాలు అమల్లోకి వస్తాయని అందరికి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తలారి చందు, ఇలాపాక వెంకటేశ్వర్లు, అర్జున్, తెల్లూరి ప్రకాష్, కిరణ్, నవీన్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# మునిసిపల్ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ప్రక్రియ వేగవంతం చేయాలి...జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



మహబూబాబాద్, జూన్ 27:(నేటినిజం ప్రతినిధి): శుక్రవారం ఐడీఓసీలోని వి.సి సమావేశ మందిరంలో స్థానిక సంస్థలు,రెవెన్యూ అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, కే. వీర బ్రహ్మాచారి మునిసిపల్ కమిషనర్లలతో కలిసి జిల్లాలోని మునిసిపాలిటీ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల గుర్తింపు ను వేగవంతం చేయాలని, పారదర్శకంగా లబ్ధిదారులను గుర్తించాలని, మునిసిపాలిటీ వారీగా సాంక్షన్ అయి అప్రూవల్ అయిన దరఖాస్తులను గ్రౌండింగ్ చేయడానికి చర్యలు తీసుకోవాలని అన్నారు.ఈ సమావేశంలో జడ్పీ సీఈవో పురుషోత్తం, హౌసింగ్ డిఇ రాజయ్య, మహబూబాబాద్ తొర్రూరు, మరిపెడ, డోర్నకల్ మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు


BRAHMAM BHAVANA

ఆహ్వానం

జాబేర్ పాషా తొలి కవితాసంపుటి

అగరు ధూపం ఊదు పొగ

పుస్తకావిష్కరణ సభ



సభాధ్యక్షులు
కటుకోజ్వల ఆనందాచారి

ఆవిష్కర్త
గుంటూరు లక్ష్మీనరసయ్య

అతిథులు
కవి యాకూబ్
సుజాత నాంపల్లి
నాగిళ్ళ రమేశ్
తగుళ్ళ గోపాల్
మోహనకృష్ణ అనంతోజు

తప్పకుండా రండి!

సమయం
29.6.2025
ఆదివారం
మధ్యాహ్నం
2:00 గంటలకు

వేదిక
చాకలి ఐలమ్మ హాల్,
సుందరయ్య విజ్ఞానకేంద్రం
బాగ్‌లింగంపల్లి
హైదరాబాద్

KAVISANGAMAM


Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.